News Daily
ఎడిటర్ : B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :126 | ఖమ్మం | శనివారం, జూన్ 21, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# చర్చలపై భేషజాల్లేవ్

విభజన చట్టం ప్రకారం గోదావరిపై పోలవరం ప్రాజెక్టుకు మాత్రమే అనుమతులున్నాయి. దానికి ఏ మార్పులు చేసినా తెలంగాణ నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. బనకచర్ల పోలవరానికి అనుబంధంగా నిర్మిస్తున్నందున మా అనుమతి తప్పనిసరి. - సీఎం రేవంత్‌రెడ్డి

- అవసరమైతే ఏపీ సీఎంను మేమే ఆహ్వానిస్తాం..
- అదే సమయంలో తెలంగాణ హక్కులను వదులుకోం
- 23న మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం
- బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- సమస్యకు మూలకారణం కేసీఆర్, హరీశ్‌రావులేనని ఆరోపణ
- భాజపాకు భారాస ‘అవయవదానం’లా సీట్లిచ్చిందని విమర్శ
- అందుకే కిషన్‌రెడ్డి కేటీఆర్‌కు లైజనింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారని ఎద్దేవా



“ఇరు రాష్ట్రాలు కూర్చొని మాట్లాడుకుంటే గోదావరి-బనకచర్ల సమస్య పరిష్కారమవుతుంది. ఇలా చర్చించుకోవడంలో మాకేమీ భేషజాలు లేవు. అలాగని తెలంగాణ హక్కులను కోల్పోవడానికి సిద్ధంగా లేం” అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన దిల్లీలోని తన అధికార నివాసంలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెట్టింది మాజీ సీఎం కేసీఆర్, నాటి ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావులేనని ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీల వాటా సరిపోతుందని 2015లో లేఖ ఇచ్చింది హరీశ్‌రావేనని, గోదావరి వరద నీటిని పెన్నా పరీవాహక ప్రాంతానికి తరలించడానికి అభ్యంతరం లేదంటూ 2016 నాటి ఎపెక్స్ కౌన్సిల్‌లో చెప్పింది కేసీఆరేనని ధ్వజమెత్తారు. అందుకు సంబంధించిన లేఖలు, మీటింగ్ మినిట్స్‌ను రేవంత్‌రెడ్డి మీడియాకు విడుదల చేశారు.

**ఏ రాష్ట్రంతోనూ వివాదాలు కోరుకోం**

“ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రతిపాదనలపై ముందుగా తెలంగాణ

వివరాలు 2లో..



# సాగు సాయం రూ.1.04 లక్షల కోట్లు

- ధాన్యం కొనుగోళ్లు, సన్నాల బోనస్‌కు రూ.43 వేల కోట్లు
- రైతు భరోసాకు రూ.21 వేల కోట్లు
- పంట రుణమాఫీకి రూ.20 వేల కోట్లు
- ఏడాదిన్నరలోనే వ్యవసాయానికి భారీగా నిధుల వ్యయం
- ‘రైతు రాజ్యం’ పేరిట విడుదల చేసిన నివేదికలో ప్రభుత్వం వెల్లడి

వ్యవసాయ రంగం, రైతుల సంక్షేమానికి ఏడాదిన్నర వ్యవధిలోనే భారీగా నిధులు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం అమలు చేసిన పథకాలకు రూ.1.04 లక్షల కోట్లను వెచ్చించినట్లు వెల్లడించింది. ధాన్యం కొనుగోళ్లు, సన్నాల బోనస్‌కు రూ.43 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొంది. ప్రస్తుత వానాకాలంలో విడుదల చేస్తున్న సొమ్ముతో కలిపి రైతుభరోసా కింద మొత్తం రూ.21 వేల కోట్ల పెట్టుబడి సాయంతో కొత్త రికార్డు నెలకొల్పినట్లు వివరించింది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.20,616 కోట్ల పంట రుణాలను మాఫీ చేసినట్లు తెలిపింది. రైతు సంక్షేమం కోసం గత 18 నెలల్లో నిధుల వ్యయం వివరాలను ‘రైతు రాజ్యం’ పేరిట నివేదికగా ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. “దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత తక్కువ కాలంలో... ఇంత పెద్దమొత్తం ఖర్చు చేసిన దాఖలాలు లేవు. గతంలో రూ.లక్ష రుణమాఫీకి నాలుగైదు విడతలుగా అరకొరగా నిధులు విడుదల చేయటంతో.. రైతులపై వడ్డీల భారం తడిసి మోపెడైంది. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లయినా

వివరాలు 2లో..

## బ్యాంకింగ్ వ్యవస్థలోనే లోపాలున్నాయి

- ఛార్జీల పేరుతో సామాన్యులపై భారం వేస్తున్నారు..
- రూ.వేల కోట్లు ఎగవేసిన వారిని వదిలేస్తున్నారు
- బ్యాంకు అధికారుల తీరుపై హైకోర్టు వ్యాఖ్యలు



దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థలో లోపాలున్నాయని ఓ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు వ్యాఖ్యానించింది. బ్యాంకు అధికారులు వేల కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేస్తున్నారని, తీసుకున్న వారు ఎగవేస్తుంటే పట్టించుకోవడంలేదని, అదే సమయంలో సామాన్యులపై వివిధ ఛార్జీల పేరుతో భారం మోపుతున్నారని ఆక్షేపించింది. మంజూరుచేసిన అధికారులపైనే వసూలు చేయాల్సిన బాధ్యత పెడితే.. వ్యవస్థలో కొంతయినా మార్పు వస్తుందని పేర్కొంది. హైదరాబాద్ సనత్‌నగర్ ఎస్‌బీఐ బ్రాంచి అధికారులు ముందస్తు చెల్లింపుల పేరుతో, ఎలాంటి సమాచారం లేకుండా


వివరాలు 2లో..

## రూ.7.42 కోట్ల మోసం కేసులో ఐపీఎస్ అధికారిణి భర్త అరెస్ట్

- ఐపీఎస్ అధికారిణి భర్త పురుషోత్తం చవాన్ మరో ఆర్థిక మోసం కేసులో అరెస్ట్
- సూరత్ వ్యాపారికి రూ.7.42 కోట్లు టోకరా వేసినట్టు ఆరోపణ
- ప్రభుత్వ కోటా ప్లాట్లు, కాంట్రాక్టుల పేరిట డబ్బు వసూలు
- ముంబై ఆర్థిక నేరాల విభాగం పోలీసుల అదుపులోకి చవాన్
- గతంలోనూ రూ.24.78 కోట్ల మోసం కేసులో అరెస్ట్ అయిన చవాన్

మహారాష్ట్రకు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారిణి భర్త మరో భారీ ఆర్థిక మోసం కేసులో అరెస్ట్ అయ్యారు. ఇదివరకే ఒక చీటింగ్ కేసులో అరెస్టయిన ఆయన, తాజాగా రూ.7.42 కోట్ల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో ముంబై ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్ర కేడర్‌కు చెందిన

వివరాలు 2లో..




## విశాఖలో యోగా డేకు అనూహ్య స్పందన.. సూరత్ రికార్డు బద్దలు!



- తెల్లవారుజాము 4 గంటల నుంచే కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన ప్రజలు
- ఉదయం 5:45 గంటలకే లక్షన్నర మంది యోగా సాధనలో పాల్గొన్న వైనం
- యోగాలో సూరత్ పేరిట ఉన్న రికార్డును అధిగమించిన విశాఖ
- క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన వారిని మాత్రమే లెక్కిస్తున్న అధికారులు
- యోగా డే నిర్వహణపై సీఎం చంద్రబాబు ప్రత్యేక పర్యవేక్షణ

వివరాలు 2లో..

## వైసీపీ వాళ్లంతా టీడీపీలోకి రావాలి... లేకపోతే.. తోకలు కత్తిరించి సున్నం పెడతాం



ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా కూడా ఎన్నికల హీట్ ఇంకా చల్లబడలేదు. అధికార టీడీపీ, వైసీపీల మధ్య వార్ రోజురోజుకూ ముదురుతోంది. వైసీపీ నేతలు, కార్యకర్తల అరెస్టులు ఒకవైపు, ప్రభుత్వ వైఫల్యాలపై వైసీపీ నిరసనలు మరొకవైపు వెరసి రాష్ట్రంలో పొలిటికల్ హీట్ ని పెంచుతున్నాయి. ఇప్పుడు గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు

వివరాలు 2లో..

## జగన్ నేర స్వభావి: ధూళిపాళ్ల నరేంద్ర

- యువతను రెచ్చగొట్టి నేరాల వైపు ప్రోత్సహించారని ధ్వజం
- యువతను పక్కదారి పట్టించారని మండిపాటు
- టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించారని వ్యాఖ్య

వివరాలు 2లో..



## ‘యోగాంధ్ర’తో ప్రపంచం ఏపీ వైపు చూస్తోంది...

### కూటమి నేతలను అభినందించిన మోదీ

- (జూన్ 21) విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం
- విశాఖ చేరుకున్న ప్రధాని మోదీకి ఘనస్వాగతం పలికిన చంద్రబాబు, పవన్, లోకేశ్
- ఏపీ నేతల సమష్టి కృషి ప్రశంసనీయమన్న ప్రధాని మోదీ

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తున్న ‘యోగాంధ్ర’ కార్యక్రమం ఏర్పాట్లపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విశాఖ ఎంపీ భరత్‌లతో ప్రధాని ప్రత్యేకంగా సమావేశమై చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని, దీని ద్వారా

వివరాలు 2లో..



# విశాఖలో యోగా డేకు అనూహ్య స్పందన.. సూరత్ రికార్డు బద్దలు!

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం విశాఖపట్నంలో అపూర్వ దృశ్యం ఆవిష్కృతమైంది. నగరవాసులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు వేలాదిగా తరలివచ్చి యోగా సాధనలో పాల్గొన్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే ప్రజలు యోగా డే వేదిక వద్దకు చేరుకోవడం మొదలుపెట్టారు. ఉదయం 5:45 గంటల సమయానికే సుమారు లక్షన్నర మంది యోగా కార్యక్రమంలో పాల్గొన్నారని అధికారులు తెలిపారు.

ఈ భారీ జనసమీకరణతో గతంలో సూరత్‌లో 1,47,952 మందితో నెలకొల్పిన యోగా రికార్డును విశాఖ అధిగమించినట్లయింది. కార్యక్రమానికి హాజరైన వారి సంఖ్యను నిర్ధారించేందుకు అధికారులు పక్కా ఏర్పాట్లు చేశారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకున్న వారిని మాత్రమే లెక్కలోకి తీసుకుంటున్నట్లు వారు స్పష్టం చేశారు. ఉదయం 7 గంటల సమయానికి హాజరయ్యే వారి సంఖ్య మరో లక్ష వరకు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందనతో యోగా డే కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. వివిధ వయసుల వారు, కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఉత్సాహంగా యోగాసనాలు వేయడం విశేషం. ఈ కార్యక్రమం ప్రజలలో ఆరోగ్యం మరియు యోగా పట్ల పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనంగా నిలిచింది.

యోగా డే నిర్వహణపై సీఎం చంద్రబాబు ప్రత్యేక పర్యవేక్షణ

ఇంటర్నేషనల్ యోగా డే నిర్వహణపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఉదయం 5 గంటలకే ఆయన మంత్రులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. యోగా దినోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లు, ప్రజల భాగస్వామ్యం, సౌకర్యాల కల్పన వంటి అంశాలపై కూలంకషంగా సమీక్షించారు.

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తెల్లవారుజాము 4 గంటల నుంచే ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమ స్థలాలకు చేరుకోవడం ప్రారంభించారని తెలిపారు. ప్రజలు ఎంతో ఉత్సాహంగా యోగాసనాలు వేసేందుకు తరలివస్తున్నారని, ముఖ్యంగా యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, ముఖ్యంగా తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏర్పాట్ల విషయంలో మంత్రులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

# జగన్ నేర స్వభావి: ధూళిపాళ్ల నరేంద్ర

మాజీ ముఖ్యమంత్రి జగన్ పై పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ ఒక నేరపూరిత స్వభావం కలిగిన వ్యక్తి అని ఆయన విమర్శించారు. క్రిమినల్ ముఖ్యమంత్రికి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే ముఖ్యమంత్రికి మధ్య తేడాను ప్రజలు జగన్, చంద్రబాబుల పాలనను చూసి తెలుసుకోవచ్చని ధూళిపాళ్ల అన్నారు.

యువతను తప్పుదోవ పట్టించి, వారిని నేర కార్యకలాపాల వైపు ఉసిగొల్పుతున్నారని జగన్‌పై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో పోలీసు యంత్రాంగంపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. యువతను ఈ విధంగా తప్పుదారి పట్టించడం పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, ఈ ఉదయం చింతలపూడి గ్రామంలో ధూళిపాళ్ల రైతులకు వ్యవసాయ డ్రోన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం చాలా అవసరమని స్పష్టం చేశారు. కూలీల కొరతను అధిగమించడానికి వ్యవసాయ పరికరాలు, యాంత్రీకరణ ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.

డ్రోన్‌ల వాడకం వల్ల పురుగుమందుల పిచికారీలో రైతులకు ఎదురయ్యే శ్రమ తగ్గుతుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 80 శాతం రాయితీపై ఈ డ్రోన్‌లను అందిస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామంలో విద్యావంతులైన యువతకు డ్రోన్‌ల వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, తద్వారా వారికి ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని ధూళిపాళ్ల వెల్లడించారు. రైతులను సంఘటిత పరిచి, బృందాలుగా ఏర్పాటు చేసి డ్రోన్‌లను పంపిణీ చేస్తున్నట్లు ఆయన వివరించారు.

# చర్చలపై భేషజాల్లేవ్

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వ అభిప్రాయం అడిగి ఉండాల్సింది. ఎపెక్స్ కౌన్సిల్ వంటి మార్గాల్లో కాకుండా.. ఏపీ సీఎం చంద్రబాబు నేరుగా బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ నివేదిక (పీఎఫ్ఆర్)ను కేంద్రానికి సమర్పించడం అభ్యంతరకరం. ఆంధ్రప్రదేశ్ మాకు దిగువన ఉంటే.. మేం కర్ణాటక, మహారాష్ట్రలకు దిగువన ఉన్నాం. ఏ రాష్ట్రంతోనూ మేం వివాదాలు కోరుకోవడంలేదు. అదే సమయంలో తెలంగాణ హక్కులనూ వదులుకోబోం. మాకున్న అనుమానాలపై చర్చించి పరిష్కరించుకోవాలనుకుంటున్నాం. దీనిపై ఈ నెల 23న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తాం.. అవసరమైతే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని మేమే చర్చలకు ఆహ్వానిస్తాం. ముందు ముఖ్యమంత్రుల స్థాయిలో చర్చించుకొని తర్వాత ఎపెక్స్ కౌన్సిల్‌కు వెళ్తాం.

**భారాస అప్పుడెందుకు మాట్లాడలేదు?**

జలాల తరలింపునకు పునాది పడిందే హరీశ్‌రావు సాగునీటిశాఖ మంత్రిగా ఉన్నప్పుడు. గోదావరి వరద జలాలను రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అవసరాల కోసం తరలించేందుకు డీపీఆర్ తయారు చేసే బాధ్యతను వాప్కోస్‌కు అప్పగిస్తూ 2016 ఏప్రిల్ 16న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో నంబరు 262ను జారీ చేసింది. ప్రకాశం బ్యారేజీ నుంచి పెదగంజాం వయా కమ్మమూర్ కెనాల్ వరకు నీటి తరలింపు, గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి సంగం బ్యారేజీకి వరదజలాల తరలింపు కోసం మరో డీపీఆర్ తయారీ బాధ్యతను అదే వాప్కోస్‌కు అప్పగిస్తూ ఏపీ ప్రభుత్వం 2018 మార్చి 29న జీవోఆర్‌టీ నం.230 విడుదల చేసింది. ఆనాడు తెలంగాణ నీటిపారుదల మంత్రిగా ఈ జీవోల గురించి నోరెత్తని హరీశ్‌రావు.. ఇప్పుడు పెద్దపెద్ద ఉపన్యాసాలిస్తున్నారు. గోదావరి నుంచి పెన్నా పరీవాహక ప్రాంతానికి 400 టీఎంసీల నీరు తరలించడానికి నాలుగు ప్రత్యామ్నాయాలను వాప్కోస్ డీపీఆర్‌లో సూచించింది. బనకచర్ల.. పెన్నా బేసిన్‌లో ఒక భాగమే. కానీ ఆ డీపీఆర్ గురించి ఆనాడు భారాస ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అలా దానికి 2016లోనే పునాది పడింది. అదే ఏడాది జరిగిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనూ గోదావరి జలాల తరలింపునకు అప్పటి సీఎం కేసీఆర్ అంగీకరించారు.

**భారాస కంటే 95 టీఎంసీలు ఎక్కువే అడుగుతున్నాం**

కృష్ణా జలాల్లో మేం 500 టీఎంసీలు అడుగుతుంటే భారాస తప్పు పడుతోంది. కానీ రాష్ట్రానికి 299 టీఎంసీలు చాలని 2015 జూన్ 18, 19 తేదీల్లో జరిగిన కృష్ణా నదీ యాజమాన్యమండలి సమావేశంలో లేఖ రాసి ఇచ్చింది అప్పటి నీటిపారుదల మంత్రి హరీశ్‌రావే. 2020 డిసెంబరు 19న జరిగిన మరో కేఆర్ఎంబీ మీటింగ్‌లోనూ కృష్ణా జలాలను ఏపీ, తెలంగాణల మధ్య 66:33 నిష్పత్తిలో పంచుకోవడానికి అంగీకరించారు. 2020 డిసెంబరు 22న జరిగిన ఎపెక్స్ కమిటీ సమావేశంలో.. కేడబ్ల్యూడీటీ-2 తీర్పు నోటిఫై చేసేంతవరకూ కేడబ్ల్యూడీటీ-1 తీర్పు ప్రకారం ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీల మేర పంపిణీ చేయడానికి అంగీకరించింది కూడా కేసీఆరే. అయితే అప్పటివరకు తాము చెప్పింది తప్పని గుర్తించి.. కృష్ణా జలాలను ఏపీ, తెలంగాణల మధ్య 50:50 నిష్పత్తిలో పంపిణీ చేయాలని 2023 జులై 10వ తేదీన హరీశ్‌రావు రాష్ట్ర ఆర్థికమంత్రి హోదాలో కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు లేఖ రాశారు. దాని ప్రకారం.. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన 811 టీఎంసీల్లో 50% అంటే 405.5 టీఎంసీలే. మేం అంతకంటే దాదాపు 95 టీఎంసీలు ఎక్కువగా.. 500 టీఎంసీలు ఇవ్వాలని అడుగుతున్నాం. ఇప్పుడు దీన్ని తప్పుబట్టే వారిని ఏమనాలి? ఈ విషయంలో తీసేసిన తహసీల్దార్లు చేసే విమర్శలను నేను పట్టించుకోను.

**ఆ విషయం వారికే తెలియాలి**

తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ అనుమతులు తీసుకుందా? అని కొందరు అడుగుతున్నారు. అది పాత ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టే. కేసీఆర్ దాని డిజైన్ మార్చి కాళేశ్వరం కట్టారు. దానిపై అప్పట్లో ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించారా? లేదా? అన్నది కేసీఆర్, చంద్రబాబునాయుడు, జగన్‌మోహన్‌రెడ్డిలకే తెలియాలి.

**భారాస రుణాన్ని భాజపా తీర్చుకుంటోంది**

మోదీకి చంద్రబాబునాయుడు సీట్లు కావాలి. చంద్రబాబు మరోసారి గెలవడానికి బనకచర్ల ప్రాజెక్టు కావాలి. కేసీఆర్ తన పార్టీని బతికించుకోవడానికి ఈ వివాదం కావాలి. గత పార్లమెంటు ఎన్నికల్లో భారాస అవయవదానం మాదిరి.. తన సీట్లు త్యాగం చేసి భాజపాను గెలిపించింది. కేసీఆర్, హరీశ్‌రావులు ప్రాతినిధ్యం వహించే మెదక్ సీటును కూడా కట్టబెట్టింది. ఆ రుణం తీర్చుకోవడానికి ఇప్పుడు కిషన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. అందుకే మేం నిర్వహించిన అఖిలపక్ష ఎంపీల సమావేశానికి రాకుండా దిల్లీ వెళ్లిపోయారు. మాకంటే ఒకరోజు ముందే జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌లను కలిసి మా ప్రయత్నాలకు అడ్డుపుల్లలు వేసేందుకు ప్రయత్నించారు. రాష్ట్రానికి మంచి చేయడం మాని.. ఆయన భారాసను బతికించేందుకు ప్రయత్నిస్తున్నారు. కిషన్ రెడ్డి ట్యూటర్ కేటీఆరే. కిషన్‌రెడ్డి ఇప్పుడు కేటీఆర్‌కు లైజనింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు” అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.

**మా ప్రాజెక్టులపై స్పందించని కేంద్రం**
**- సీఎం రేవంత్‌రెడ్డి**

ట్రైబ్యునల్ నిర్ణయం ప్రకారం.. గోదావరిలో తెలంగాణకు 968 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 518 టీఎంసీల కేటాయింపులున్నాయి. కానీ మా నీళ్ల వినియోగానికి ప్రాజెక్టులను ప్రతిపాదిస్తే కేంద్రం అనుమతులు ఇవ్వడంలేదు. నేనేమీ రాజకీయ వ్యాఖ్యలు చేయడంలేదు. నాకు ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉంది. అందుకే కేంద్ర ప్రభుత్వంలోని ప్రతి వేదిక ముందూ మా వాదనలు వినిపిస్తున్నాం. అన్ని అధీకృత సంస్థలకూ మా బాధలు చెబుతున్నాం. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒకవైపు చర్చలకు సిద్ధమంటూనే మరోవైపు ప్రీ ఫీజిబిలిటీ నివేదికపై వేగంగా ముందుకెళ్లారు. దాన్ని ఇప్పటికే కేంద్ర మంత్రులకు సమర్పించారు. నేను 18 నెలలుగా క్రమం తప్పకుండా దిల్లీకొచ్చి మా ప్రతిపాదనలను కేంద్ర మంత్రుల ముందుంచుతున్నా వాటిపై చలనం లేదు.

# ‘యోగాంధ్ర’తో ప్రపంచం ఏపీ వైపు చూస్తోంది...

- మొదటి పేజి తరువాయి

ప్రపంచం ఏపీ వైపు చూసేలా చేశారని ప్రధాని మోదీ అభినందించారు. ఏపీ నేతల సమష్టి కృషి, పనితీరు అద్భుతంగా ఉన్నాయని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రం సరికొత్త రికార్డులను సృష్టిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు.

అంతకుముందు, యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ శుక్రవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తదితరులు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి ప్రధాని నేరుగా ఐఎన్ఎస్ డేగాకు చేరుకుని, అక్కడి నుంచి నౌకాదళ అతిథిగృహానికి వెళ్లారు. ఈ రాత్రి ఆయన అక్కడే బస చేస్తారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉదయం విశాఖపట్నం ఆర్కే బీచ్ రోడ్డులో నిర్వహించే భారీ యోగాంధ్ర కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని యోగాసనాలు వేయనున్నారు. కార్యక్రమాలు ముగిసిన అనంతరం, ఉదయం 11:50 గంటలకు ఆయన ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రధాని పర్యటన నేపథ్యంలో విశాఖ నగరంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# వైసీపీ వాళ్లంతా టీడీపీలోకి రావాలి... లేకపోతే.. తోకలు కత్తిరించి సున్నం పెడతాం

జయరాం చేసిన వ్యాఖ్యలు చుస్తే పరిస్థితి ఏ రేంజ్ కి వెళ్లిందో అర్థమవుతుంది. వైసీపీ వాళ్లంతా టీడీపీలో చేరాలని.. లేకపోతే తోకలు కత్తిరించి సున్నం పెడతామని అన్నారు గుమ్మనూరు జయరాం. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ఈమేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు గుమ్మనూరు జయరాం.

స్థానిక సంస్థల ఎన్నికలోపు వైసీపీ శ్రేణులంతా టీడీపీలోకి రావాలని.. స్థానిక సంస్థల ఎన్నికల వరకు టైం ఇస్తున్నాని.. టీడీపీలో చేరకపోతే తోకలు కత్తిరించి సున్నం పెడతామంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు ఎమ్మెల్యే జయరాం. ఒకవేళ లోకేష్ రెడ్ బుక్ క్లోజ్ చేసినా కూడా.. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత తాను రెడ్ బుక్ ఓపెన్ చేస్తానని హెచ్చరించారు జయరాం.

ఎమ్మెల్యే జయరాం వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ మారాయి. వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య మాటల యుద్ధాన్ని మరింత పెంచాయి జయరాం వ్యాఖ్యలు. అధికారం అడ్డుపెట్టుకొని కూటమి నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారని.. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని కామెంట్ చేస్తున్నారు వైసీపీ శ్రేణులు. ఇటీవల జగన్ సత్తెనపల్లి పర్యటన సందర్భంగా పుష్ప 2 సినిమాలోని డైలాగులతో కూడిన ప్లకార్డులు దుమారం రేపిన క్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.. మరి, జయరాం వ్యాఖ్యలపై వైసీపీ ఎలా స్పందిస్తుంది.. కూటమి సర్కార్ చర్యలు తీసుకుంటుందా లేదా అన్నది వేచి చూడాలి.

## సాగు సాయం

### రూ.1.04 లక్షల కోట్లు

అన్నదాతల అప్పు తీరలేదు. మా ప్రభుత్వం తొలి ఏడాదిలోనే ఏకకాలంలో రూ.2 లక్షల్లోపు మాఫీ చేసి.. 25 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసింది” అని నివేదికలో ప్రభుత్వం పేర్కొంది.

రైతు రాజ్యం నివేదికలోని ముఖ్యాంశాలు..

“ఈ నెల 16 నుంచి ఐదు రోజుల్లో రూ.7,310.59 కోట్ల రైతు భరోసా సొమ్మును 65.12 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశాం. తొమ్మిది రోజుల్లో రూ.9,000 కోట్లు జమ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలతో ఆర్థిక, వ్యవసాయ శాఖలు పంపిణీని వేగంగా పూర్తి చేస్తున్నాయి.

వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు అందిస్తున్నాం. 29 లక్షల పంపుసెట్లకు ఉచిత కరెంటు సరఫరాకు రూ.16,691 కోట్ల సబ్సిడీని విద్యుత్తు సంస్థలకు చెల్లించాం. రూ.29,562 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేశాం. వడ్లు అమ్మిన 21.59 లక్షల మంది రైతుల ఖాతాల్లో 48 గంటల్లోనే డబ్బులు జమ చేశాం. 2023-24లో 15 లక్షల మంది రైతుల నుంచి 95.31 లక్షల టన్నుల ధాన్యాన్ని రూ.20,964 కోట్లతో సేకరించాం.

సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ప్రకటించడంతో రాష్ట్రంలో సన్నాల సాగు, దిగుబడి గణనీయంగా పెరిగింది. యాసంగి సీజన్‌లో దొడ్డు రకం 80.56 లక్షల టన్నులు, సన్న రకం 46.96 లక్షల టన్నులు పండాయి.

ఈ ఏడాది వరి సాగులో తెలంగాణ కొత్త రికార్డు నెలకొల్పింది. 2.80 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడితో దేశంలో అగ్రస్థానంలో నిలిచింది.

అకాల వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.260 కోట్ల పంట నష్టపరిహారం చెల్లించాం.

గత కొన్నేళ్లుగా రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంటు విడుదల చేయకపోవడంతో నిలిచిపోయిన 16 కేంద్ర ప్రాయోజిత పథకాల పునరుద్ధరణకు ప్రభుత్వం దాదాపు రూ.245 కోట్లు వెచ్చించింది. ఆయిల్‌పామ్ సాగులో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 2025 మార్చి వరకు 60,432 ఎకరాల్లో పంట వేశారు. గతంలో గెలల ధర టన్నుకు రూ.12,534 ఉండగా.. సర్కారు చొరవతో రూ.18,748కి పెరిగింది. బిందు, తుంపర సేద్య పరికరాలపై పెద్దఎత్తున రాయితీ ఇస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100%, చిన్న, సన్నకారు, బీసీ రైతులకు 90%, ఇతరులకు 80% రాయితీపై డ్రిప్ పరికరాలు.. రైతులందరికీ 75% రాయితీపై స్ప్రింక్లర్లను అందిస్తున్నాం. 2023 డిసెంబరు నుంచి 40,265 మంది రైతులకు రూ.282 కోట్ల విలువైన పరికరాలను అందించాం” అని నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం వివరించింది.

## సన్నాల బోనస్ విడుదల చేయాలి

- మొదటి పేజి తరువాయి

23.22 లక్షల టన్నుల సన్నాలు సేకరించిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా బోనస్ చెల్లించలేదు. రాష్ట్రంలో పొద్దుతిరుగుడు రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. ఈ పంట కొనుగోలు పూర్తయి 75 రోజులు దాటినా రైతుల ఖాతాలో డబ్బులు జమ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క సిద్దిపేట జిల్లాలోనే 50% మంది రైతులకు డబ్బులు ఇవ్వలేదు. అన్నదాతల పట్ల రేవంత్‌రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి ఇది అద్దం పడుతోంది. ఇప్పటికైనా స్పందించి వెంటనే పొద్దుతిరుగుడు పంటకు డబ్బులు, సన్నాలకు బోనస్ విడుదల చేయాలి’ అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## వ్యవసాయంలోనూ ఏఐ

- మొదటి పేజి తరువాయి

ఈ వానాకాలం సీజన్ నుంచే ప్రయోగాత్మకంగా దీనిని ప్రారంభిస్తామని చెప్పారు. ఈ విషయంపై సచివాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. తెలంగాణ విశ్వవిద్యాలయ అగ్రోనమి ప్రొఫెసర్ నీలిమ తాను మూడేళ్లుగా ఏఐ వినియోగంపై చేస్తున్న పరిశోధనలను మంత్రికి వివరించారు. ఇక్రిశాట్ ప్రతినిధులు ఉపగ్రహ ఛాయాచిత్రాల ఆధారంగా వివిధ రాష్ట్రాలకు అందిస్తున్న సేవలు, పంటల సాగు విస్తీర్ణ అంచనా పద్ధతులను వెల్లడించారు. అగ్రివాస్ ప్రతినిధులు పంటలకు సోకే తెగుళ్లు, నీటి ఎద్దడి పరిస్థితుల అంచనాకు ఉపగ్రహ ఆధారిత పరిజ్ఞానం వినియోగం గురించి తెలిపారు. సమావేశంలో వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావు, సంచాలకుడు గోపి తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ వ్యవస్థలోనే లోపాలున్నాయి

ఛార్జీలను మినహాయించుకోవడాన్ని సవాలుచేస్తూ ఉత్తమ్ ధాతు అండ్ ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఆస్తులను హామీగా ఉంచి తీసుకున్న రుణాన్ని ముందుగానే చెల్లించినందుకుగాను రూ.1.16 కోట్లు కంపెనీ ఖాతా నుంచి బ్యాంకు మినహాయించుకుందన్నారు. ఇది ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధమని, జరిమానాతోపాటు వడ్డీతో సహా తిరిగి ఇచ్చేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి బ్యాంకింగ్ వ్యవస్థ లోపభూయిష్ఠంగా ఉందని పేర్కొంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ‘సాధారణ, మధ్య తరగతి ప్రజలు రుణాలు తీసుకుంటే ఛార్జీల పేరుతో బ్యాంకులు భారం వేస్తున్నాయి. రుణం ముందు తీర్చేసినా, జాప్యం చేసినా జరిమానాల పేరుతో సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. తీసుకున్న గృహరుణం పూర్తయిన తర్వాత.. సంబంధిత డాక్యుమెంట్ తీసుకునేటప్పుడు కూడా ఛార్జీలు చెల్లించాల్సి వస్తోంది. అదే సమయంలో రూ.వేల కోట్ల రుణం తీసుకుని ఎగవేసిన వారి నుంచి వసూలు చేయలేకపోతున్నాయి. మంజూరు చేసిన బ్యాంకు అధికారే వసూలు బాధ్యత కూడా తీసుకోవాలనే నిబంధన ఉంటే రుణాలు సక్రమంగా మంజూరవుతాయి’ అని న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రస్తుత కేసులో ఆర్‌బీఐతోపాటు బ్యాంకు అధికారుల వివరణను పరిశీలించాల్సి ఉందన్నారు. ప్రతివాదులైన ఆర్‌బీఐతోపాటు ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీలకు నోటీసులు జారీ చేస్తూ..కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

## రూ.7.42 కోట్ల మోసం కేసులో ఐపీఎస్ అధికారిణి భర్త అరెస్ట్

ఐపీఎస్ అధికారిణి రష్మీ కరాండికర్ భర్త పురుషోత్తం చవాన్‌పై పలు ఆర్థిక నేరాలకు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయి. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన ఒక వ్యాపారితో పాటు మరికొందరిని ఆయన రూ.7.42 కోట్ల మేర మోసగించినట్లు పోలీసులు గుర్తించారు. ప్రభుత్వ కోటా కింద తక్కువ ధరలకే ప్లాట్లు ఇప్పిస్తానని నమ్మబలికి వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా, మహారాష్ట్ర పోలీస్ అకాడమీకి టీ షర్టులు సరఫరా చేసే కాంట్రాక్టును సదరు వ్యాపారవేత్తకు ఇప్పించేందుకు తాను సహాయం చేస్తానని కూడా చవాన్ హామీ ఇచ్చారని పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంపై అందిన ఫిర్యాదు మేరకు అధికారులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. కాగా, పురుషోత్తం చవాన్ గతంలోనూ ఇలాంటి ఆర్థిక మోసాలకే పాల్పడ్డారు. ముంబై, థానే, పుణే నగరాల్లో ప్రభుత్వ కోటా కింద రాయితీ ధరలకు ప్లాట్లు ఇప్పిస్తానని చెప్పి ఎంతో మందిని నమ్మించారు. ఈ విధంగా దాదాపు రూ.24.78 కోట్ల మేర మోసం చేశారన్న ఆరోపణలపై గత నెలలోనే పోలీసులు అతనిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆ కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న చవాన్‌ను, తాజా రూ.7.42 కోట్ల మోసం కేసుకు సంబంధించి విచారణ నిమిత్తం పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల ముగ్గుల నిర్మాణం

- సంతోషంతో లబ్ధిదారులు
- కాంగ్రెస్ మండల్ జనరల్ సెక్రెటరీ, కొండి శ్రీనివాస్



**జూన్ 20 ( సీ కే న్యూస్) చేగుంట :**చేగుంట మండల్ పోలంపల్లి గ్రామంలో శుక్రవారం నాడు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు, ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి ముగ్గులు పోయడం జరిగింది, కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రెటరీ కొండి శ్రీనివాస్ మరియు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కర్రె స్వామి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం చాలా సంతోషకరం గత ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించడం జరిగింది, అందుకుగాను ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ప్రతి పథకం ప్రజల వద్దకే వెళుతుంది, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ, మెంబర్స్ మాట్లాడుతూ, మా గ్రామానికి 15 ఇల్లు మంజూరు చేసినందుకు కాంగ్రెస్ పార్టీ సోనియా గాంధీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉమ్మడి మెదక్ జిల్లా నూతన మంత్రివర్యులు వివేక్ కు మరియు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముద్దుబిడ్డ ఆత్మీయుడు అన్న సిహెచ్ శ్రీనివాస్ రెడ్డికి మరియు చేగుంట కాంగ్రెస్ పార్టీ మండల్ కమిటీకి, సీనియర్ నాయకులు, కార్యకర్తలకు, పోలంపల్లి గ్రామ ప్రజలకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము, ఈ కార్యక్రమంలో, ఇందిరమ్మ ఇళ్ల మండల ఏఈ, ఎండి మహమ్మద్ రియాజ్, గ్రామ కార్యదర్శి స్రవంతి, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ, మెంబర్స్, శ్రీనివాస్ స్వామి, నర్సింలు, రాజేశ్వరి, సౌందర్య, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మల్లేశం, నరేష్, కే స్వామి, సురేష్, జె స్వామి, స్వామి, యాదగిరి,లక్ష్మణ్,అంజి, నర్సింలు, వెంకట్, దుర్గయ్య, శేఖర్, నర్సింలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల కుటుంబలకు, గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ, పాల్గొన్నారు,

# వేములపల్లి మండల కేంద్రంలో"డ్రీమ్ డే స్టూడియో"ప్రారంభోత్సవం






**సీకే న్యూస్ వేములపల్లి జూన్ 20 :**మిర్యాలగూడ నియోజకవర్గం వేములపల్లి మండల కేంద్రంలో నార్కెట్ పల్లి-అద్దంకి హైవే వెంబడి నల్గొండ రోడ్డులో "డ్రీమ్ డే స్టూడియో"ని యాజమాన్యం వారు ప్రారంభించారు ఈ సందర్భంగా యాజమాన్యం వారు మాట్లాడుతూ అత్యాధునిక టెక్నాలజీతో ప్రీ వెడ్డింగ్ షూటింగ్, బర్త్డేషూటింగ్స్%డ%సెలబ్రేషన్స్, ఇతరత్రా షూటింగులు నిర్వహించుకునేందుకు ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించామని తెలిపారు.స్టూడియోలో వివిధ రకాల షూటింగుల కొరకు 9000626111 సంప్రదించాలని తెలియజేయడమైనది

# సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు ఫైల్స్ క్లియర్ చేయాలి ....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
- కలెక్టరేట్ పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- విధులకు సకాలంలో హాజరు కావాలి
- ఏఐ టూల్స్ వంటి ఆధునిక సాంకేతికతను అధికారులు అందిపుచ్చుకోవాలి
- కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది పని తీరుపై వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బందితో సమీక్షించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూన్ -20:**అధికారులు, సిబ్బంది సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు ఫైల్స్ క్లియర్ చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

శుక్రవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది పని తీరుపై వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బందితో సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కలెక్టరేట్ లో పని చేసే సిబ్బంది మొత్తం ఒక బృందంగా పని చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని, ప్రజలకు, అధికారులకు మంచి వారధిగా సిబ్బంది పని చేయాలని అన్నారు.

సోమవారం వచ్చే ప్రజావాణి దరఖాస్తులు, ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రుల దగ్గర నుంచి వచ్చే ప్రజావాణి దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్ పెట్టడానికి వీలు లేదని, మన పరిధిలో సమస్య పరిష్కారం ఐతే వెంటనే చేయాలని, లేని పక్షంలో సంబంధిత కారణాలు తెలుపుతూ ఫైల్ క్లోజ్ చేయాలని, లబ్దిదారునికి ఎందుకు ఆ పని చేయలేక పోతున్నామో కారణాలతో కూడిన లేఖ రాయాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రతి శాఖ తమ పరిధిలో పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్ పై రెగ్యులర్ గా సమీక్షలు నిర్వహించాలని అన్నారు. సమస్యలను పరిష్కరించే ధోరణితో అధికారులు,సిబ్బంది పని చేయాలని అన్నారు. కలెక్టరేట్ లో ఆఫీస్ సబార్డినేట్ నుంచి సూపరింటెండెంట్ వరకు అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, సకాలంలో కార్యాలయానికి హాజరు కావాలని, అనుమతి తీసుకుని మాత్రమే సెలవుపై వెళ్లాలని అన్నారు.

కలెక్టరేట్ లో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత కల్పించాలని, కలెక్టర్ టాయిలెట్ ఎంత నీట్ గా మెయింటైన్ చేస్తామో పబ్లిక్ టాయిలెట్స్ కూడాను అలాగే మెయింటైన్ చేయాలని, టాయిలెట్స్ ఎవరు ఎప్పుడు క్లీన్ చేయాలో సిబ్బంది షెడ్యూల్ తయారు చేయాలని అన్నారు. కలెక్టరేట్ లో త్రాగునీటి సరఫరా ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు.

ఖమ్మం జిల్లాలో ప్రోటోకాల్ పకడ్బందీగా అమలు చేయాలని, సీఎం, మంత్రుల మీటింగ్, పబ్లిక్ ప్రోగ్రాం, జిల్లా స్థాయి సమీక్షలకు పాటించాల్సిన ప్రోటోకాల్, ఫుడ్, ఆహ్వానం, సౌండ్, మినీట్స్ తయారు చేయడంపై స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ తయారు చేసి, ప్రతి అధికారికి వారి వారి బాధ్యతలు అప్పగించాలని అన్నారు.

జిల్లా పరిపాలనలో ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ ను ఉపయోగించి సులువుగా పనులు ఏ విధంగా పూర్తి చేయగలుగు తామో వివరిస్తూ అధికారులకు త్వరలోనే వర్క్ షాప్ ఏర్పాటు చేస్తామని, భవిష్యత్తు లో ఏఐ టూల్స్ చాలా కీలక పాత్ర పోషిస్తాయని, ఆధునిక సాంకేతికతను అధికారులు అందిపుచ్చుకోవాలని కలెక్టర్ సూచించారు.

అనంతరం కలెక్టరేట్ విభాగాలకు చెందిన సెక్షన్ ఇంచార్జిలను పరిచయం చేసుకుని వారు నిర్వహిస్తున్న విధులపై పలు సూచనలు చేశారు.

ఈ సమావేశంలో డిఆర్వో ఏ. పద్మ శ్రీ, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల సూపరింటెండెంట్ లు, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విపత్తుల నిర్వహణకు పకడ్బందీగా సన్నద్ధం కావాలి.....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- 3 నెలల పాటు ఎన్డిఆర్ఎఫ్ బృందాలు జిల్లాలో స్టేషన్ చేసే విధంగా చర్యలు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను గుర్తించాలి
- విపత్తుల నిర్వహణపై ఎన్డిఆర్ఎఫ్ బృందం, సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూన్ -20:**విపత్తుల నిర్వహణకు పకడ్బందీగా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

శుక్రవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి విపత్తుల నిర్వహణపై ఎన్డిఆర్ఎఫ్ బృందం, సంబంధిత అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గత సంవత్సరం వచ్చిన భారీ వరదల నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో 3 నెలల పాటు ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందాలు స్టేషన్ లో ఉండేలా చర్యలు చేపట్టి, అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా అధికారులు పూర్తి చేయాలని తెలిపారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా రిహాబిలిటేషన్ సెంటర్ లను ముందుగా గుర్తించాలని, అవసరమైన పక్షంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లను కూడా రిహాబిలిటేషన్ సెంటర్ గా ఏర్పాటు చేయాలని, ఏ ప్రాంతం ప్రజలను ఏ సురక్షిత ప్రాంతానికి తరలిస్తారు అనే విషయమై మ్యాపింగ్ చేసి సోమవారం నాటికి వివరాలు అందించాలని అన్నారు.

వాతావరణ శాఖ నుంచి వరద ముప్పు ఉందని హెచ్చరిక రాగానే జిల్లాలో హెలికాప్టర్ అందుబాటులో పెట్టుకోవాలని, వరద సమయంలో అవసరమైన బోట్లు, రోప్స్, లైఫ్ జాకెట్, మైక్స్, లైట్లు, జేసిబి , క్లినింగ్ ఎక్విప్మెంట్ మొదలగు సామాగ్రి డివిజన్, గ్రామం వారీగా అందుబాటులో పెట్టాలని అన్నారు. వరద తర్వాత పారిశుధ్య నిర్వహణకు సంబంధించి సిబ్బంది, జవాన్ లను ఇళ్ల వారీగా కేటాయించాలని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు అవసరమైన బ్లాంకెట్, బట్టలు, ఆహార సామాగ్రి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సిద్ధం చేసుకోవాలని అన్నారు.

విపత్తుల సమయంలో ప్రజలు ప్యానిక్ కాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, జిల్లా యంత్రాంగంతో ఎలా సహకరించాలి వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

ప్రతి మండలంలో విపత్తు నిర్వహణ కోసం అవసరమైన సామాగ్రి అందుబాటులో ఉంచుకోవాలని, వాటి పనితీరు ఒక్కసారి చెక్ చేయాలని కలెక్టర్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సన్నద్ధం చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, ఎన్డిఆర్ఎఫ్ బృందం కమాండర్ ఎస్. గౌతం, ఏ.ఎస్.ఐ మద్దిలేటి, హెడ్ కానిస్టేబుల్స్ జగదీష్, సురేష్ కుమార్, కానిస్టేబుల్స్ రియాజుద్దీన్ , కె. జనార్ధన్, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డిని కలిసిన మంగ శ్రీనివాస్



**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్**

ఆత్మకూర్(ఎం) ప్రముఖ వ్యాపార వేత్త బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు మంగ శ్రీనివాస్ ఈ సందర్భంగా మంగ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆత్మకూరు మండల ప్రజలు ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సహాయం అందజేస్తూ నిరుపేదలకు అండగా ఉంటున్నందుకు వారికీ కృతజ్ఞతలు తెలిపారు.

# టీ జే యూ మండల కార్యాలయాన్ని ప్రారంభించిన టీ జే యూ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా



**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :**ఆత్మకూరు మండల కేంద్రంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ మండల కార్యాలయాన్ని తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా చేతుల మీదుగా ప్రారంభించారు . ఈ సందర్భంగా మొహమ్మద్ షానూర్ బాబా మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి జర్నలిస్ట్ కి అండగా ఉంటామని అన్నారు . వర్కింగ్ జర్నలిస్టుల అందరికి అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని , వర్కింగ్ జర్నలిస్టులకి వయసుతో సంబంధం లేకుండా నెలకి 10 వేల రూపాయలు ఫించన్ సౌకర్యం కల్పించాలని , హెల్త్ కార్డులు , ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు . ఈ కార్యక్రమంలో టీ జే యూ రాష్ట్ర నాయకులు సుక్క అశోక్ , టీ జే యూ మండల అధ్యక్షులు గడ్డం నాగరాజు , టీ జే యూ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం మల్లేష్ , టీ జే యూ మండల గౌరవ అధ్యక్షులు నోముల రవీందర్ రెడ్డి , టీ జే యూ మండల ఉపాధ్యక్షులు షేక్ అజీజ్ , టీ జే యూ మండల ప్రధాన కార్యదర్శి పొన్నగాని సతీష్ గౌడ్ , టీ జే యూ మండల కోశాధికారి కట్టెకోల రమేష్ గౌడ్ , టీ జే యూ జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు దంతూరి సుమలత గౌడ్ , జిల్లా నాయకులు నజీర్ ఖాన్ , పగడాల అంబాదాస్ , పోచం కన్నయ్య తదితరులు పాల్గొన్నారు .

# రేషన్ బియ్యం పట్టివేత,సన్న బియ్యం సైతం అన్యాక్రాంతం

- పేదలకు ఇచ్చే సన్న బియ్యం వదలని దళారులు
- పకడ్బందీగ దుకాణాలు దాటిస్తున్న మధ్య వర్తులు



**సీకే న్యూస్ నల్గొండ భ్యూరో జూన్ 20:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగ ప్రవేశపెట్టినటువంటి పేదల కడుపు నింపడానికి చౌకదారుల దుకాణం ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సదరు రేషన్ డీలర్లు దుర్వినియోగం చేస్తున్నారు.వివరాల్లోకెళితే విశ్వసనీయ సమాచారం మేరకు జూన్(17)బుధవారం తెల్లవారుజామున వేములపల్లి మండలం మోల్కపట్నం గ్రామం నుండి సుమారు 30 క్వింటాళ్ల (పిడిఎస్)సన్నబియ్యం సరాసరి ప్రభుత్వ గోనెసంచులలో మధ్య దళారులు టాటా ఏసీ లో తరలిస్తున్నారని తెలియడంతో స్థానిక పోలీస్ వారు "టాటా ఏసీ పిడిఎస్"బియ్యన్ని స్వాధీన పరుచుకున్నారు దీనిపై స్థానిక ఎస్సై డి.వెంకటేశ్వర్లు ను వివరాలు అడగగ పిడిఎస్ రవాణా చేస్తున్న"టాటా ఏసీ ని"స్వాదినపరుచుకున్నట్టు దీనిపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

# అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న యువకుడు



**జూన్ 20 ( సీ కే న్యూస్) చేగుంట:**చేగుంట మండల్ రుక్మాపూర్ గ్రామానికి చెందిన యువకుడు అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న శ్రీకాంత్, వివరాలోనికి వెళితే గురువారం 19.06.2025 నాడు రుక్మాపూర్ గ్రామానికి చెందిన నాగారపు శ్రీకాంత్, వయస్సు 26 సంవత్సరాలు తండ్రి కీ.శే కాశయ్య, వృత్తి వ్యవసాయము తన అవసరం నిమిత్తము అప్పులు చేయగా అట్టి అప్పులు ఎలా తీర్చాలో అనిరోజు మదనపడుతూ ఉండేవాడు, గురువారం నాడు ఉదయం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్ళి మోటార్ కేబుల్ వైరుతో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇట్టి విషయములో మృతుని తల్లి నాగారపు శివమ్మ ఫిర్యాదు మేరకు చేగుంట, చైతన్యకుమార్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు

# మొగిలిపాక గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన.



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 19. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మామిడి సత్తిరెడ్డి లబ్ధిదారులతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవడం పేద ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని అన్నారు, ఇళ్ళు మంజూరు అయిన ప్రతి ఒక్కరు వెంటనే నిర్మాణాలు చేపట్టాలని విడతల వారిగా ప్రభుత్వ నిబంధనల మేరకు ఐదు లక్షల రూపాయలు అందజేస్తుందని అన్నారు ,ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో మొగిలి పాక గ్రామంలో మొదటి విడతగా 18 ఇళ్ల మంజూరు అయ్యాయని చెప్పారు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ 200 యూనిట్ల లోపు ఇండ్లకు ఉచిత కరెంటు గ్యాస్ సబ్సిడీ పేదలకు సన్న బియ్యం పంపిణీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం అనేక పథకాలు అమలు జరుగుతున్నాయని చెప్పారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మామిడి సత్తిరెడ్డి మొగిలిపాక గ్రామశాఖ అధ్యక్షులు పబ్బు ఎల్లయ్య గౌడ్ ఇందిరమ్మాయిండ్ల కమిటీ, సభ్యులు,యాస అంజిరెడ్డి యాస నిశ్శకారెడ్డి మొగిలిపాక పాపాయ వెలుసోజీ నరేంద్రచారి మర్ల మల్లయ్య, జాడిగే వెంకన్న,ముద్దసాని జైపాల్ రెడ్డి జయసింహారెడ్డి ఏడుకొండలు సుందర్ రెడ్డి సోమిరెడ్డి మొగిలిపాక నరసింహ ఏడుకొండలు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు జడిగే సుజాత కృష్ణ ముత్యాలు మమత బుచ్చయ్య మంగమ్మ తదితరులు పాల్గొన్నారు,

# భూభారతి రెవెన్యూ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

● డిప్యూటీ తాసిల్దార్ పల్లవి రెడ్డి.



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 19. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామంలో.

భూ సమస్యల పరిష్కారానికి గాను నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసిల్దార్ పల్లవి రెడ్డి సూచించారు. వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామంలో శుక్రవారం భూభారతి రెవెన్యూ సదస్సులో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మామిడి సత్తిరెడ్డి దరఖాస్తును డిప్యూటీ తహసిల్దార్ కు అందజేశారు, ఈ సందర్భంగా పల్లవిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వపరంగా రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ సదస్సులను కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.పలువురు రైతుల సమస్యలపై వచ్చిన వినతిపత్రాలను స్వయంగా స్వీకరించి వాటి పరిష్కారాలపై రైతులతో మాట్లాడారు. భూభారతి రెవెన్యూ సదస్సులో వస్తున్న ఫిర్యాదులు, వినతి పత్రాలు స్వీకరించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాటిని సత్వరమే పరిష్కరిస్తామన్నారు, సర్వే నెంబర్లలో తప్పులుంటే, పాస్ పుస్తకాల్లో పేర్ల మార్పిడి, వంశపారంపర్య మార్పిడి తదితర అంశాలపై దరఖాస్తులు చేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో గిర్ధవార్ నాగేష్ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పబ్బు ఎల్లయ్య గౌడ్ యాస అంజిరెడ్డి రైతులు ముద్దసాని జయపాల్ రెడ్డి జయసింహారెడ్డి ఏడుకొండలు సిద్ధిరాంరెడ్డి మొగిలిపాక నరసింహ సోమిరెడ్డి సుందర్ రెడ్డి రెవెన్యూ సిబ్బంది గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# రాజుపేట గ్రామంలో సింగరేణి ఉచిత వైద్య శిబిరం.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 20,సింగరేణి సేవ సమితి మరియు సింగరేణి వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు మండల పంచాయితీ పరిధిలోని రాజుపేట గ్రామంలో శుక్రవారం సింగరేణి ఉచిత వైద్య శిభిరం నిర్వహించబడినది.

ఈ సంధర్భంగా డిజిఎం (పర్సనల్) ఎస్ రమేశ్ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం తమ వంతు సామాజిక బాధ్యతగా బొగ్గు గనుల పరిసర ప్రాంతాల గ్రామస్తులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న క్రమంలో భాగంగా రాజుపేట లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో స్త్రీ, పురుషులు, వృద్ధులు, విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో విచ్చేసి మొత్తం 97 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించటం జరిగింది. ఈ వైద్య శిభీరం లో సాధారణ వ్యాధులకు ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు బిపి, షుగర్ వ్యాదిగ్రస్తులను పరీక్షించి వారికి కూడా వ్యాధి నియంత్రణ మందులు ఇవ్వడం జరిగింది. మణుగూరు ఏరియా పరిసర ప్రాంత గ్రామస్తులకు అందిస్తున్న ఉచిత వైద్య శిభిరాలను మరింతగా విస్తృత పర్చడం జరిగింది.

ఈ సందర్భంగా ప్రస్తుతం ప్రబల్లుతున్న సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పాటించవలసిన పరిసరాల, గృహ మరియు వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించవలసిన ఆవశ్యకత పై సింగరేణి వైద్యులు రాజుపేట గ్రామస్తులకు అవగాహన కలిపించడం జరిగిందని డిజిఎం (పర్సనల్) ఎస్ రమేష్ తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో, వేంకట రమణయ్య, ఏరియా హాస్పిటల్ సిబ్బంది యూ.. భవానీ, పి. నాగసాయి, సేవ కో ఆర్డినేటర్ కె. వీ. మారేశ్వర రావు, రాజుపేట గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన....

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- తల్లాడ మండలం నారాయణపురంలో నిర్మించిన రోడ్డును ప్రారంభోత్సవం చేసిన మంత్రివర్యులు పొంగులేటి



సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం/తల్లాడ, జూన్ -20: పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రివర్యులు, తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో 5 కోట్ల 50 లక్షలతో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజల దీవేనెలతో రాష్ట్రంలో సంవత్సరంన్నర క్రితం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, తల్లాడ-నారాయణ పురం- కొడవటిమెట్ట గ్రామాలను కలిపి 5 కోట్ల 50 లక్షలతో రోడ్డు నిర్మించామని అన్నారు. గత పాలకులు అమలు చేసిన పథకాలను కొనసాగిస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను పేదలకు చిత్తశుద్ధితో అందిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబ్, ఇఇ తానేశ్వర్, కల్లూరు ఆర్డీఓ ఎల్. రాజేందర్, పెనుబల్లి డిఇ ఎండి. ఖలీల్ అహ్మద్, తహసీల్దార్, ఎంపీడీఓ, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడే యోగా దినోత్సవం యోగసాధన వల్ల ఎన్నో ఉపయోగాలు







● కరణం గణేష్ రవికుమార్

● యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు



జూన్ 20 ( సీ కే న్యూస్) చేగుంట :యోగం అంటే అదృష్టం,కూడిక,కలయిక,సంబంధం,ధ్యానం అని అర్థాలు ప్రచారం లో ఉన్నాయి.అదృష్టం అను అర్థం లో యోగా శబ్దాని వాడుతూ యోగం బాగుండటం వల్ల ఇంతవాడు,అంతవాడు అయినాడని అంటూ ఉంటారు.యోగాభ్యాసం మనిషికి ఆరోగ్యం శక్తి తేజస్సు చురుకుదనం ప్రసాదించడమే గాక మనిషి జీవితంలో సుఖ, సంతోష, ఆనందాన్ని నింపుతుంది. ఆరోగ్యం సరిగా లేకపోతే సిరిసంపదలు ఎన్ని ఉన్నా వ్యర్థం పరమేశ్వరుడు యోగ విద్యకు ఆద్యుడు అని అంటారు. అనేకమంది యోగులు, మునులు, ఋషులు, మహర్శులు, బ్రాహర్షులు, యోగ విద్యను ప్రపంచానికి అందించారు. ఆనాడు ప్రచారంలో ఉన్న యోగ ప్రక్రియల్ని పరిశోధించి స్వానుభవంతో ఐదు వేల సంవత్సరాలకు పూర్వం పతంజలి మహర్షి రచించిన యోగ దర్శనం మహత్తరమైన యోగ శాస్త్ర గ్రంథం అని చెప్పవచ్చు ఈ యోగాలో ఆరు రకాలుగా విభజించబడ్డాయి రాజయోగం, భక్తియోగం, జపయోగం, జ్ఞానయోగం, కర్మయోగం, హఠయోగం ఇవన్నీ కూడా యోగ శాస్త్రానికి సంబంధించిన నిధులే. మనం జీవిస్తున్న ఈనాటి ఆధునిక యుగంలో అత్యాధునిక నగర జీవితంలో క్షణ క్షణం మనిషికి కలుగుతున్న టెన్షన్, వత్తిడి, నీరసం, నిస్పృహ,భయం, వ్యతిరేక ఆలోచనలు,అవగాహన శక్తి తరుగుదల మొదలగు రుగ్మతలు తగ్గిపోతాయి. శారీరకంగాను మానసికంగానూ సుఖశాంతులు ఆరోగ్యం పొంది ఆత్మవికాస మార్గాన పైనుంచి తన జన్మని సార్థకతను చేసుకుంటాడు. ద్వేషం, అసూయ, ఆవేశం మొదలగు దుష్ప్రవర్తనలు తగ్గి ప్రశాంతత, స్థిరత్వం మనిషి పొందుతాడు. యోగ చేయడం వలన మధుమేహం, అస్తమ, రక్తపోటు, గుండెపోటు, నడుము నొప్పి మోకాళ్ళ నొప్పి మెదడుకు సంబంధించిన వ్యాధులతోపాటు అన్ని రోగాలకు యోగా దివ్య ఔషధంగా పనిచేస్తుంది. యోగాభ్యాసం అలవాటు కాగానే మనిషి దినచర్య అలవాట్లు ఆలోచన విధానం ఆహార విహారాదులు మార్పు చెందుతాయి. యోగాసన చేయడం వలన తమ నిత్య కార్యక్రమాల్లో విధుల్లో, దక్షత, ఏకాగ్రత,చురుకుజనం సాధించి తమ ఉన్నతాధికారుల మన్నన పొందుతారు. యోగ అభ్యాసం చేయడానికి మిగతా క్రీడల్ల కాకుండా గాలి వెలుతురు వచ్చే ప్రదేశాల్లో కిటికీలు తలుపులు తెరిచి ఉన్న గదుల్లోనూ సమతలంగా ఉన్నచోట యోగాభ్యాసం చేయవచ్చు.యోగాభ్యాసం చేయడానికి అడ్డం మూడు అడుగులు, పొడవు ఆరడుగుల స్థలం ఉంటే చాలు. యోగాభ్యాసం చేయడానికి ఉదయం సాయంత్రం అనుకూలమైన సమయం. యోగ చేయడానికి ముందు అల్పాహారం తీసుకుంటే ఒకటిన్నర గంటల సమయం, భోజనం చేసినట్లయితే మూడు గంటల వ్యవధి వ్యత్యాసం ఉండాలి. యోగ్యాబ్యాసం చేయడానికి ఆరు సంవత్సరాల పైబడిన పిల్లల నుండి వంద సంవత్సరాల పైబడిన వారు కూడా యోగ సాధన చేయవచ్చు. ఇప్పటి కాలంలో ఎక్కువమంది హఠాయోగ ఆచరిస్తారు శరీరం, మనసు, ప్రాణం, బుద్ధి, ఆత్మ మొదలగు గల అవయవాలను మరియు ఆనాటి పలు యోగ విధానాలను దృష్టిలో పెట్టుకొని వాటిని పరిశోధించి పతంజలి మహర్షి యోగ అష్టంగాన్ని ప్రతిపాదించారు. అవి 1)యమ 2)నియమ 3)ఆసన 4)ప్రాణాయామ 5)ప్రత్యాహార 6)ధారణ 7)ధ్యానం 8)సమాధి వీటినే అష్టాంగ యోగ అంటారు. పతంజలి మహర్షి కాలంలో 84 లక్షల ఆసనాలను ఆచరించేవారు.ఇప్పటి కాలంలో 400 వరకు ఆసనాలను ఆచరిస్తున్నారు వాటిలో ముఖ్యమైన పద్మాసనం, బద్ధపద్మాసనం, సిద్ధాసనం, సుఖాసనం, పచ్చి మొత్తానాసనం,పాదహస్తాసనం,అర్థ చక్రాసనం,చక్రాసనం,త్రికోణాసనం, వృక్షాసనం, వజ్రాసనం,వ్యాగ్రసనం, టిట్టిభాసనం,ఉత్తితపాదహస్థాసనం, భద్రాసనమ్ వృక్చా, ఉష్ట్రాసనం, భుజంగాసనం శలభాసనం, సేతుబందాసనం, పవనముక్తాసనం, ధనురాసనం, హలాసనం, సర్వాంగాసనం ,భూమాసనం,కుక్కుటాసనం,మాయురాసనం, శీర్షాసనం,శవాసనం ముఖ్యమైనవి. ప్రాణాయామములో కపాలబాతి,కంటబాతి, నాడీ శోధన,శీతలి, సిత్కారి, బ్రమరి ప్రాణాయామం, ధ్యానం ముఖ్యమైనవి ముఖ్యంగా ప్రతి రోజు యోగ ప్రాణాయామం ఆచరించడం వల్ల మానవ శరీరంలోని 600 కండరాలు, 206 ఎముకలు,72 వేల నాడులతో పాటు శరీరం లోని ముఖ్యమైన అవయాలైన గుండె,మెదడు,కాలేయం,ఊపిరితిత్తులు,కిడ్నీలు,అన్నవాహిక,ప్రే ఎగుల తో పాటు అన్ని అవయవాలు మెరుగుపడి ఆరోగ్యంగా ఉంటారని,ప్రాణాయామం వలన ముఖవర్చస్సు తో పాటు ఏకాగ్రత పెరిగి నిత్య యవ్వనంగా ఉంటారని తెలిపారు.ప్రతి రోజూ యోగా చేయడం వలన షుగర్,రక్తపోటు,గుండె జబ్బులు,క్యాన్సర్,వెన్నునొప్పి,మేడనొప్పులు,ఆస్తమా,మెదడుకు సంబంధించిన వ్యాధులతో పాటు ప్రతి వ్యాధిని నియంత్రించవచ్చని తెలిపారు.యోగా,ప్రాణాయామం వలన రోగులు మందులు వాడవలసి అవసరం ఉండదని తెలిపారు.వీటితో పాటు షట్క్రియలు,ముద్రలతో కూడా చాల ఉపయోగాలు ఉంటాయని ఆయన తెలిపారు.

# ధర్మాజీగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి (శ్రీనివాస్)జూన్ 20:చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామంలో బిజెపి పార్టీకి చెందిన సామిడి ప్రవీణ్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీకి చెందిన పగిళ్ల అండమ్మ శుక్రవారం మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పబ్బు రాజు గౌడ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధిని కోరుకునే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, తాజామాజి ప్రజాప్రతినిధులు గ్రామ



కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ క్రాంతి కుమార్ ను సత్కరించిన తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు



సికె న్యూస్ ప్రతినిధి,ఖమ్మం: ఖమ్మం జిల్లాలో యూత్ కాంగ్రెస్ విస్తరణ, బలోపేతానికి విశేష కృషి చేసినందుకు యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ కె. క్రాంతి కుమార్ ను తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జెక్కిడి శివ చరణ్ రెడ్డి శుక్రవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సత్కరించారు. యూత్ కాంగ్రెస్ చేపట్టిన ఆన్ లైన్ పోర్టల్ విధానంలో ప్రత్యేకత చాటడంలో క్రాంతి కుమార్ ముందంజలో నిలిచారు. ఈ సందర్భంగా.. జెక్కిడి శివ చరణ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఇన్ చార్జ్ దీపక్ ప్రజ్ఞా ప్రత్యేకంగా సత్కరించారు. భవిష్యత్తులోనూ.. మరింతగా రాణించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఆత్మ కూర్ లోటీ జే యూ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా విలేకరుల సమక్షం లో పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు




సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :ఆత్మకూరు మండల కేంద్రంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ మండల కార్యాలయాన్ని తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా చేతుల మీదుగా ప్రారంభించారు మహ్మద్ శనూర్ బాబా ఆత్మకూర్ టీ జే యు ఆఫీసు లో పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు టి జే యు విలేకరులు బర్త్ డే శుభకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా మొహమ్మద్ షానూర్ బాబా మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి జర్నలిస్ట్ కి అండగా ఉంటామని అన్నారు . వర్కింగ్ జర్నలిస్టుల అందరికి అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని , వర్కింగ్ జర్నలిస్టులకి వయసుతో సంబంధం లేకుండా నెలకి 10 వేల రూపాయలు ఫించన్ సౌకర్యం కల్పించాలని , హెల్త్ కార్డులు , ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు . ఈ కార్యక్రమంలో టీ జే యూ రాష్ట్ర నాయకులు సుక్క అశోక్ , టీ జే యూ మండల అధ్యక్షులు గడ్డం నాగరాజు , టీ జే యూ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం మల్లేష్ , టీ జే యూ మండల గౌరవ అధ్యక్షులు నోముల రవీందర్ రెడ్డి , టీ జే యూ మండల ఉపాధ్యక్షులు షేక్ అజీజ్ , టీ జే యూ మండల ప్రధాన కార్యదర్శి పొన్నగాని సతీష్ గౌడ్ , టీ జే యూ మండల కోశాధికారి కట్టెకోల రమేష్ గౌడ్ , టీ జే యూ జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు దంతూరి సుమలత గౌడ్ , జిల్లా నాయకులు నజీర్ ఖాన్ , పగడాల అంబాదాస్ , పోచం కన్నయ్య తదితరులు పాల్గొన్నారు .

## అంతర్జాతీయ ఒలంపిక్ డే సందర్భంగా భద్రాచలం లో నిర్వహించిన ఒలంపిక్ రన్ సక్సెస్.

- జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్ రెడ్డి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 20,**ఉల్లాసంగా భద్రాచలంలో ఒలంపిక్ డే రన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యం లో అంతర్జాతీయ ఒలంపిక్ డే సందర్భంగా 18 తారీకు పాల్వంచలో మొదలైన ఒలంపిక్ రన్ నిన్న దమ్మపేట చేరుకుని ఈరోజు ఉదయం 6:30 కి భద్రాచలం లో ఒలంపిక్ జ్యోతిని క్రీడాకారులు ఎమ్మెల్యే తెల్ల వెంకటరావుకి అందజేశారు. ఈ సందర్భంగా తెల్లం వెంకటరావు మాట్లాడుతూ భద్రాచలం లో త్వరలో ఒక 400 మీటర్ల అథ్లెటిక్స్ ట్రాక్ కోసం ఐదు ఎకరాలు సేకరించాలని త్వరలో ఆ ట్రాక్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులో తెస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పిఓ బి రాహుల్ మాట్లాడుతూ భద్రాచలం పరిసర ప్రాంతం లో గిరిజన క్రీడాకారులు అద్భుతంగా రానిస్తున్నారని వారికి మా సహకారం ఇవ్వటం ద్వారా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధిస్తారని తెలిపారు ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏ ఎస్ పి విక్రమ్ కుమార్ సింగ్ ఐపీఎస్ మాట్లాడుతూ యువత గంజాయి లాంటి చెడు వ్యసనానికి పోకుండా క్రీడల వైపు మల్లాలి అని భద్రాచలం ని గంజాయి రహిత పట్టణంగా మార్చాలని యువతని కోరారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జి యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులకు మంచి క్రీడా సదుపాయాలు కలగజేస్తే మంచి అంతర్జాతీయ క్రీడాకారులని అందచేస్తాము అని తెలిపారు. అనంతరము అంబేద్కర్ సెంటర్ నుంచి ఈ ఒలంపిక్ డే రన్ సుమారు 200 మంది స్థానిక క్రీడాకారులు చాలా ఉత్సంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ చైర్మన్ కే మహిధర్ చీఫ్ పాటర్న్ నాగ సీతారాములు వైస్ ప్రెసిడెంట్ వై వెంకటేశ్వర్లు జాయింట్ సెక్రెటరీ పి నాగేంద్రబాబు భద్రాచలం కన్వీనర్ గిరి ప్రసాద్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు దాట్ల రాజు,జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ట్రెజరర్ కుంచాల రమేష్,ఉదయ్ కుమార్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి జీ వి రామి రెడ్డి ( సిటీ స్టైల్ జిమ్ కోచ్ ) పీడీలు శ్వేత దుర్గారావు, ఎర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల మధ్య ఘర్షణలను సృష్టిస్తున్న సివిల్ అధికారులు.

- అక్రమ పద్ధతుల్లో దొడ్డి దారిన పోటీ కార్మికులను తీసుక రావడం మానుకోవాలి.
- బంగ్లోస్ వద్ద జరిగే పరిణామాలకు సింగరేణి సివిల్ అధికారులే బాధ్యత వహించాలి.
- సివిల్ అదికారులను హెచ్చరించిన ఏఐటీయూసీ నాయకులు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 20,**సింగరేణి కొత్తగూడెం కార్పొరేటు ఇల్లందు బంగ్లోస్ వద్ద జరుగుతున్న ఆందోళన, నిరసనలకు సింగరేణి సివిల్ అధికారులే బాధ్యులని, అత్యంత బాధ్యతారాహిత్యంగా తప్పుడు పద్ధతిలో టెండర్లను పిలవడం వల్ల రైటర్ బస్తి,బంగ్లోస్ కాంట్రాక్ట్ కార్మికులు మధ్య ఘర్షణలను సృష్టించడానికి సివిల్ ఆధికారులు ప్రయత్నించడం సరికాదని, తక్షణమే తమ వైఖరిని మార్చుకోవాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య ఉపాధ్యక్షులు,కే డబ్ల్యూ కిష్టాఫర్ లు హెచ్చరించారు. శుక్రవారం బంగ్లో స్ వద్ద సివిల్ కాంట్రాక్ట్ కార్మికులు వేరే ప్రాంతాల నుంచి వస్తున్న పోటీ కార్మికులను అడ్డుకొని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటియుసి నాయకులు మాట్లాడుతూ తమ యూనియన్ ఆధ్వర్యంలో సింగరేణి అధికారుల కు రిప్రజెంటేషన్ చేసినప్పటికీ పట్టించుకోకుండా తప్పుడు పద్ధతిలో వాహనాలలో పోటీ కాంట్రాక్ట్ కార్మికులను దొంగతనంగా తీసుకురావడం సరికాదని అన్నారు.తప్పుడు నిర్ణయాలను తీసుకొని వాటిని సరి చేయకుండా వారి నిర్ణయాలను సమర్థించుకుంటూ కాంట్రాక్ట్ కార్మికుల మధ్య ఘర్షణ సృష్టించడానికి చేస్తున్న ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని కోరారు.గత వారం రోజుల నుండి కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చేస్తున్నప్పటికీ సివిల్ అధికారులు నిర్లక్ష్యం వివరించడం సరికాదని విమర్శించారు. ఇప్పటికైనా తప్పుడు పద్ధతిలో పిలిచిన టెండర్లను సరి చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఇల్లందు బంగ్లో స్ వద్ద జరిగే కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన పోరాటాలకు సివిల్ ఆధికారులే పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు జి రంజిత్,కృష్ణమూర్తి, రాజు, శంకర్, నాగమ్మ, సురేష్, ఆదిలక్ష్మి, సుశీల, విజయ్ సుజాత, మాధవి, కళ్యాణ్, లక్పతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహమ్మద్ యూసఫ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల.





**సీకే న్యూస్ వలిగొండ మండలం, ప్రతినిధి బాలరాజు జూన్ 20.**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో వలిగొండ బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ అఫ్రోజ్ తండ్రి మహమ్మద్ యూసఫ్ గారు మరణి%శీ%చడంతో ఈరోజు మాజీ ఎమ్మెల్యే గౌరవ పైళ్ల శేఖర్ రెడ్డి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు

# నా భర్తను బతికించండి....

- రోజు రోజుకూ మృత్యు ఒడికి చేరుతున్న వైనం...
- ఈ న్యూస్ చూసిన ప్రతి ఒక్కరు మీకు తోచిన సహాయాన్ని అందించండి....
- అరుదైన క్యాన్సర్ తో బాధపడుతున్న నందిపాడు వాసి.
- అరు నెలలుగా కొనసాగుతున్న చికిత్స.
- దాతలు సాయం కోరుతున్న భార్య సమ్మక్క.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / అశ్వారావుపేట ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 20,**కోటి మందిలో ఒకరికి వచ్చే అరుదైన క్యాన్సర్తో బాధపడుతున్న తన భర్తకు చికిత్స చేయించేందుకు అవసరమైన ఆర్థిక సాయం చేయాలంటూ ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో వేడుకుంటుంది. తన భర్తను కాపాడుకునేందుకు సాయం చేయాలంటూ ఆ రోగి భార్య సవలం సమ్మక్క కన్నీటి పర్యంతమవుతున్నారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం అశ్వారావుపేట మండలం, నందిపాడు గ్రామానికి చెందిన సవలం కాంతారావు (40) వ్యవసాయ కూలి అరు నెలల క్రితం క్యాన్సర్ అని వైద్యులు నిర్ధారించారు. ఖమ్మం, హైదరాబాద్ లోని హాస్పిటల్లో అరు నెలలుగా చికిత్స చేయిస్తున్నారు. ఇప్పటికే ఉన్న పొలం భూమిని అమ్మేసి చికిత్స కోసం అప్పులు చేసి రూ. 3 లక్షల వరకు ఖర్చు చేశారు. అయినా నయం కాలేదు.. ఈ నేపథ్యం లో ప్రభుత్వం, దాతలు ఆర్థిక సాయం చేస్తే తన భర్తను కాపాడుకుంటామని చేతులు జోడించి అభ్యర్థిస్తున్నారు. సాయం చేయదలచిన దాతలు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతా నంబరు.. 35204450325 సవలం సమ్మక్క ,ఐఎఫ్ఎస్సీ కోడ్

ఎస్ బి ఐ ఎన్ 00 13326 లో 8500917079 (సవలం సౌజన్య నెంబరుకు ఫోన్పే ద్వారా జమ చేయాలని భార్య దయ హృదయము గల వారిని సామాజిక సేవా కార్యక్రమాలు చేసే వారిని ప్రజా ప్రతినిధులను రాజకీయ నాయకులను దాతలను దీన హృదయంతో అభ్యర్థిస్తోంది. దినపత్రికలో ప్రచురిస్తున్న ఈ న్యూస్ ను చూసిన ప్రతి ఒక్కరు మీకు తోచిన సహాయని వారికి అందిస్తారని అభ్యర్థించడం జరుగుతుంది.

## స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి.

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య
- జిల్లా కాంగ్రెస్ నాయకులు పబ్బు రాజు గౌడ్



**సికె న్యూస్ చౌటుప్పల్ మండల ప్రతినిధి ( శ్రీనివాస్) జూన్ 20:**స్థానిక ఎన్నికల సందర్భంగా ధర్మోజి గూడెం గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ సమావేశం శుక్రవారం నిర్వహించారు. రాబోయే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను మెజార్టీతో గెలిపించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులను కార్యకర్తలను సమన్వయం చేయుట గురించి సమావేశంలో చర్చించడం జరిగింది.ముఖ్య అతిథులుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, మాజీ జిల్లా పరిషత్ సభ్యులు చిలుకూరు ప్రభాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోయ దేవేందర్ హాజరై ఎన్నికల దిశా నిర్దేశం చేస్తూ ధర్మోజి గూడెం గ్రామపంచాయతీకి ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 65 లక్షలు వెచ్చించి సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీలను వేయించి ధర్మోజి గూడెం గ్రామపంచాయతిని అభివృద్ధి చేసిందని, వేసవికాలంలో నీటి సమస్యను పరిష్కరించడం కోసం గ్రామంలో రెండు బోర్లు వేయించేయమని, అదేవిధంగా సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతుబంధు రైతు, రుణమాఫీ వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రతి కార్యకర్త రాబోయే ఎన్నికల్లో కష్టపడి పనిచేసి సమన్వయంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగర్ విండో వైస్ చైర్మన్ అంజయ్య గౌడ్,మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు వల్లబోతు నారాయణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాచకొండ భార్గవ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీహరి, మండల కోశాధికారి ఏనుగు రవీందర్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఊదరి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఊదరి నరసింహ, గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొంతం నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ బద్రి లింగయ్య, మాజీ ఉపసర్పంచ్ కొంతం బుచ్చిరెడ్డి, కొంతం రామకృష్ణారెడ్డి, ఐతరాజు లింగస్వామి, బ్లాక్ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు ఊదరి శంకర్, కొంతం ప్రభాకర్ రెడ్డి, ఊదరి లింగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై అగ్రవర్ణాల మూకుమ్మడిదాడి దుర్మార్గచర్య

- ఫిర్యాదుచేసిన కామేపల్లి పోలీసులు పట్టించుకోకపోవడం దారుణం
- దాడిచేసిన వారిపై అట్రాసిటి కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలి

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం:**తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు కొరిపల్లి శ్రీనివాస్, మాదిగ జేఏసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మట్టె గురుమూర్తి ఖమ్మం, జూన్ 20 : దళితులపై అగ్రవర్ణాల మూకుమ్మడిదాడి దుర్మార్గచర్య అని , దాడిచేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని తెలంగాణ మాదిగహక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు కొరిపల్లి శ్రీనివాస్ , మాదిగ జేఏసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మట్టె గురుమూర్తి డిమాండ్ చేశారు . ఖమ్మం ప్రెస్క్లబ్లో శు క్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు . కామెపల్లి మండలం పింజరమడుగు గ్రామంలో మాదిగ కులానికి చెందిన పేదలైన చిప్పలపల్లి అచ్చయ్య , పిచ్చయ్య అన్నదమ్ములకు 12.30ఎకరాల ఇనాం భూమిని ఇచ్చారు . అందులో కొంత భూమి అమ్ముకోవడం , కొంత ఆక్రమణకు గురికావడం జరిగిందని వారు ఆరోపించారు . అందులో చిప్పలపల్లి శ్రీనివాసరావు తన తండ్రికి ఇచ్చిన 34 కుంటల భూమిని జూన్ 14న ఉదయం 10గంటల సమయంలో బాగుచేసుకుంటుండగా మాదిగోడా మా భూముల పక్కన నీకు భూమి ఎక్కడుందిరా అంటూ పేరుతో నానా భూతులు తిడుతూ.. కులం తక్కవ నా కొడుకుల్లారా అంటూ అగ్రకులానికి చెందిన దమ్మాలపాటి సత్యం , దమ్మాలపాటి అచ్చయ్య , దమ్మాలపాటి చిన్న వెంకన్న , గుజ్జలపుడి రాంబాబు , పంతంగి శ్రీను , వంకాయలపాటి సత్తమయ్య , శివరాత్రి రామారావు , పంతంగి పార్వతి లు , చిప్పలపల్లి శ్రీనివాసరావు పై గడ్డపార , కర్రలతో దాడిచేసి కాలు ఇరగ్గొట్టారన్నారు . శ్రీనివాసరావు భయంతో ఇతరుల సాయంలో స్థానిక కామేపల్లి పోలీస్ స్టేషన్లో మధ్యాహ్నం ఫిర్యాదుచేసిన పట్టించుకోలేదన్నారు . సాయంత్రం 6గంటల సమయంలో శ్రీనివాసరావు తమ్ముడు ఆటో డ్రైవర్ చిప్పలపల్లి ఆనందరావును కొట్టారు . మరలా ఫిర్యాదుచేసిన పోలీసులు పట్టించుకోలేదన్నారు . మరుసటి రోజు జూన్ 15న మా వాళ్ళను ఎందుకు కొట్టారని అడిగినందుకు రేణుక , లక్ష్మి , ఈశ్వరమ్మ లను కూడా విచక్షణారహితంగా కర్రలతో మూకుమ్మడిగా దాడిచేస్తూ నానాబూతులు తిట్టుకుంటూ కొట్టారని బాధితులు ఆవేధనను వ్యక్తంచేశారు . జిల్లా అధికారులు విచారణచేసి దాడిచేసి గాయపరిచిన వారిపై ఎస్సీ , ఎస్టీ అట్రాసిటి కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు . విలేకరుల సమావేశంలో ఎస్సీ ఉపకులాల జేఏసి తెలంగాణ అధ్యక్షులు గవరవరపు డేవిడ్ రాజు , దండోరా జిల్లా అద్యక్షులు దుప్పెల్లి శ్రీను , ఆర్పిఐ పార్టీ రాష్ట్ర నాయకులు నకిరికంటి సంజీవరావు , పరిశాల వెంకన్న , కొండ వెంకన్న , చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇటికల లత , బాధితులు పాల్గొన్నారు .




## సమగ్రాభివృద్ధి తుమ్మల లక్ష్యం - మేయర్ నీరజ



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం:**సమగ్ర అభివృద్ధి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లక్ష్యమని ఖమ్మం నగరపాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. తుమ్మల చొరవతో

ఎన్నడూ లేని విధంగా జిల్లాలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు సూచన మేరకు ఖమ్మం నగరంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణి శుక్రవారం 29,30,33,34,35,36,47 డివిజన్లో జరిగింది. కార్యక్రమంల్లో ఆమె మాట్లాడుతూ పనుల ఒత్తిడి కారణంగా రాష్ట్ర మంత్రి తుమ్మల కార్యక్రమాలకు రావడం కుదరక తమను కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేయాల్సిందిగా సూచించారని ఆమె తెలిపారు.

ఖమ్మం నగరంలో పలు అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని,తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిధులు మంజూరు చేయించారని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నగరంలో ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షులు త్రీ టౌన్ ఏరియా కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్, నగర ఎస్టీ సెల్ అధ్యక్షులు రుడావత్ శంకర్ నాయక్, నగర ఓబీసీ సెల్ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్ నాయకులు కన్నం ప్రసన్న,నాళం సతీష్, సాదే శంకర్, బొమ్మ ఉదయ్, లక్కీ ఉపేందర్, అర్వపల్లి శివ, నల్లపు శ్రీనివాస్, బాలిని శ్రీను, వెన్న పండు, వెంకన్న, ఎస్కే.జానీ, ఎస్కే.జాకీర్, మరాఠీ రమేష్, బొమ్మగాని సైదులు, ముద్దు కృష్ణ, తోట రంగారావు, తుపాకుల మధు, సాయి, సాదె భవాని,అర్వపల్లి స్వాతి, రేసు ప్రసన్న, రాజేంద్రప్రసాద్, తోట దమయంతి, పి.ఉపేందర్, పి.మల్లికార్జున్, స్థానిక ప్రముఖులు , పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెవిలియన్ గ్రౌండ్ వద్ద ఆయుష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో యోగా ర్యాలీ



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం:** 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా ఖమ్మం నగరంలోని అన్ని యోగా సెంటర్స్ ఆయుష్ డిపార్ట్మెంట్ మరియు యువజన క్రీడల శాఖసంయుక్తంగా నిర్వహించిన యోగా ర్యాలీ పెవిలియన్ గ్రౌండ్ వద్ద ఆయుష్ డిపార్ట్మెంట్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ పద్మావతి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ పెవిలియన్ గ్రౌండ్ నుండి పాత బస్టాండ్ సెంటర్ వద్ద మానవహారం వద్ద జిల్లా యువజన మరియు క్రీడా శాఖ అధికారి సునీల్ రెడ్డి ముగింపు ఉపన్యాసం మాట్లాడుతూ నేడు మన దేశంలో పురాతన యోగవిద్యను 194 దేశాల ఆమోదంతో యూ ఎన్ ఓ ప్రకటించిన రేపు జరగబోవు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం అని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా అధికారులు పాల్గొంటున్నారని ఉదయం 6:30 నిమిషాలకు ప్రజలందరూ యోగా చేసి ఆరోగ్యంగా ఖమ్మం ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం యోగ ధ్యాన సమైక్య కన్వీనర్ వంజాకు లక్ష్మీనారాయణ రావు అడ్వకేట్ , కో కన్వీనర్ కాసిన ఆనంద ప్రసాద్, ఆయుష్ డిపార్ట్మెంట్ వైద్యాధికారి డాక్టర్ కనక లక్ష్మి, యోగ సెంటర్స్ నిర్వహకులు బాలరాజా,శర్మ, శ్రీనివాసరెడ్డి, కోదండరావు, వరలక్ష్మి, ఆలస్యం సీతయ్య, సంధ్య, సమత, శైలజ, శ్రీనివాస రావు, రాజేంద్రప్రసాద్, వెంకట్, వెంకట్ రాములు, తదితరులు పాల్గొన్నారుద

# ఆరోగ్య సమాజానికి యోగా అద్భుత మార్గం - మాజీ ఎంపీ నామ

● భారతీయ సంస్కృతికి ప్రపంచ గుర్తింపు తీసుకొచ్చిన యోగా- మాజీ ఎంపీ నామ



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం:** జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శుక్రవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. యోగా మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, శారీరకంగా మరియు మానసికంగా సమతుల్యం సాధించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రోజువారీ జీవనశైలిలో యోగాసనాలు, ధ్యానం, శ్వాసాభ్యాసాలను అనుసరించడం ద్వారా ఒత్తిడి, ఆందోళనల నుంచి విముక్తి లభిస్తుందని వివరించారు. యోగా వ్యక్తిత్వ వికాసానికి, లోతైన ఆలోచనశక్తి పెంపునకు, శాంతి, సౌఖ్యం, ఐక్యతను అందించే శక్తిమంతమైన సాధనమని అభివర్ణించారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతిరోజూ కనీసం ముప్పై నిమిషాలు యోగా చేయాలని సూచించారు. యువత దీన్ని జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. తన దినచర్యలో భాగంగా ప్రతి రోజు యోగా చేస్తానని నామ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతలో చైతన్యం పెంచేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో యోగా కార్యక్రమాలను ప్రోత్సహించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలని నామ ఆకాంక్షించారు.

# భూ భారతి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మండల ప్రజలకు ధన్యవాదాలు

మండల్ %వీ=హ% శ్రీకాంత్





**జూన్ 20 ( సీ కే న్యూస్) చేగుంట :** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గౌరవ జిల్లాకలెక్టర్ ఆదేశాను ఈ నెల 3 వ తేదీ నుండి 20 తేదీ వరకు మండల పరిధిలో అన్ని గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు నేటితో ముగిసాయి. ఆయా గ్రామాలలో రెవెన్యూ సదస్సు నాడు భూమి కి సంబంధించిన సమస్యలు ఉన్న రైతులు, సంబంధిత పత్రాలతో రెవెన్యూ అధికారులకు తమరి అర్జీలను సమర్పించారు.అట్టి అర్జిని పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కారించుటకు నూతన ఆర్ఓఆర్ చట్టం అనగా భూభారతి చట్టం ప్రకారం, తగు చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ శ్రీకాంత్ తెలియచేశారు. మండల వ్యాప్తంగా సుమారుగా రెండు వేల దరఖాస్తులు రావడం జరిగింది.అందులో ప్రధానంగా ప్రభుత్వ భూముల కొనుగోలు మరియు సాదాబయినామాలకు సంబంధించినవే అధికంగా ఉన్నాయి. రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయుటకు అంకితభావంతో పనిచేసిన రెవెన్యూ సిబ్బందికి అభినందనలు.మండల వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించుటకు సహకరించిన మండల ప్రజలకు , ప్రజా ప్రతినిధులకు పాత్రికేయ మిత్రులకి ధన్యవాదాలు.

ఇట్లు,
తహసీల్దార్, శ్రీకాంత్ చేగుంట మండలం.

# రాజకీయాల్లో యువత పాత్ర ఎంతో కీలకం



రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం:** రాజకీయాల్లో యువత పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జెక్కిడి శివచరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్ అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నుండి మయూరి సెంటర్ లోని రాజీవ్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించిన అనంతరం జిల్లా ఎక్స్టెండెడ్ ఎక్స్ క్యూటివ్ సమావేశం సుమారు 300 మంది జిల్లా, అసెంబ్లీ, మండల, కార్యకర్తలతో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. మన పని మనం చేసుకు పోవాలని పార్టీ తన పని తాను చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిపోతే అయినా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ఏ మాత్రం రాజీ పడకుండా అనుకున్న విధముగా అన్ని వాగ్దానాలు అమలు చేసుకుంటూ పోతుందని అన్నారు.

ప్రతిపక్ష పార్టీ అదే పనిగా కాంగ్రెస్ పై బురద జల్లే ప్రయత్నం చేస్తుందని దాన్ని మనం గ్రామ స్థాయిలో తిప్పి కొట్టాలని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

లిజిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్ మాట్లాడుతూ...రాబోవు లోకల్ బాడీ ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించి ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు అత్యధిక మెజారిటీ తో గెలుపొందేలా కృషి చేయాలని అన్నారు. సీనియర్ల సలహాలు సూచనలతో నూతన కార్యవర్గం ముందుకు పోతున్నదని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మారుమూల ప్రాంతాల్లో కి తీసుకెళ్లి పూర్తి స్థాయిలో గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.రాబోవు ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ పటిష్ఠంగా ఉన్న దగ్గర యువజన కాంగ్రెస్ కే అత్యధిక సీట్లు వచ్చే విధాంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంతో కొట్లాడదామని అన్నారు.

జిల్లాలి ఇంచార్జి దీపక్ ప్రజ్ఞ మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావడానికి యువజన కాంగ్రెస్ ఒక ఫ్లాట్ ఫామ్ వంటిదని అన్నారు. కష్టపడి పని చేసే వారికి పదవులు వాటంతట అవే వస్తాయని అన్నారు. యువజన కాంగ్రెస్ లో కొత్త పాత ఏమీ లేదని ఎవరికీ ఏ సాయం కావాలి అన్నా జిల్లా ఇంచార్జ్ గా ఎప్పుడు అందుబాటులో ఉంటానని అన్నారు.ప్రతి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పని చేసి మీరు చేసిన పని గుర్తు పెట్టుకునేలా చేసుకోవాలని అన్నారు. సోషల్ మీడియా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చేసిన ప్రతి పని దాని ద్వారా రాష్ట్ర నాయకులు తెలిసే విధముగా సర్క్యులేట్ చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వీరితో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ కుమార్,జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడ్లపల్లి సంతోష్, ఖలీల్ పాషా, బెజ్జం గంగాధర్, భానోత్ కొటేష్, మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల మహేష్, క్రాంతి,బెల్లంకొండ శరత్,రాధాకృష్ణ, ఉత్తేజ్, భూక్యా భద్రం, కార్తీక్ మరియు అన్ని అసెంబ్లీ నియోజక వర్గ అధ్యక్షులు, మండల అధ్యక్షులు , యువజన కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం





● రెండవ రోజు అన్నారు గూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు

● భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు

**తల్లాడ/ జూన్ 20 సికె న్యూస్ ప్రతినిధి విజయ్**

పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ సర్పంచ్ మారెళ్ళ మమత మాజీ ఎంపీటీసీ తుమ్మలపల్లి సత్యవతి అన్నారు. శుక్రవారం అన్నారు గూడెం గ్రామంలో ప్రభుత్వ మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులతో కలిసి రెండవ రోజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని పేదల అభివృద్ధి లక్ష్యంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇందిరమ్మ రాజ్యములో అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు ఇస్తామన్నారు. పేదల అండగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. అన్నారుగూడెం గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేందుకు కృషి చేసిన జిల్లా మంత్రులకు సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్ట రాగమయి దయానంద్ గారికి మరొక్కసారి కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తుమ్మలపల్లి రమేష్, మాజీ ఎంపిటిసి తాళ్ల జోసెఫ్, పంచాయతీ సిబ్బంది, రాకేష్, ఇందిర ఇళ్ల లబ్ధిదారులు, మహిళలు పాల్గొన్నారు

# గోడౌన్ లో ఉన్న స్టాప్ రిజిష్టర్ ను తనిఖీ చేసిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు..

**సికె న్యూస్ ప్రతినిధి** మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల లోని గిడ్డంగుల సంస్థ గోడౌన్ లను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు.. గోడౌన్ లలో నిల్వ చేస్తున్న కందులు లను పరిశీలించారు,గోడౌన్ లో ఉన్న స్టాప్ రిజిష్టర్ ను తనిఖీ చేశారు..రిజిష్టర్ లోని నిల్వలకు, భౌతిక నిల్వలకు ప్రతి రోజు లెక్కలు సరిచూసుకోవాలని సూచించారు..గోడౌన్ లలో నిర్లక్ష్యానికి,అవినీతి కి పాల్పడితే సహించేది లేదని,కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు, గోడౌన్ ల సందర్శనకు వచ్చిన చైర్మన్ కు హమాలీలు వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు, వారి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరి?స్తానని వారికి హామీ ఇచ్చారు..ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు,యస్.సి.శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్



ఇంజనీర్ రాజు తదితరులు పాల్గొన్నారు..

# ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా మోదుగు బాలకృష్ణ నియామకం..

ఉత్తర్వులు అందజేసిన ఎంపీ ఆర్ కృష్ణయ్య, నోకాలమ్మ..



**తల్లాడ జూన్ 20 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్**

ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి సంఘం ఆర్. కృష్ణయ్య యూనియన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా మోదుగు బాలకృష్ణ నియామకం అయ్యారు. ఈ మేరకు రాజ్యసభ సభ్యులు, బీసీ సంఘం జాతీయ నాయకులు ఆర్ కృష్ణయ్య, యాదవ్ యాదవ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నోకాలమ్మ నుండి ఆయన నియామకపు ఉత్తర్వులు అందుకున్నారు. ఇప్పటివరకు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన బాలకృష్ణ అంకితభావం, సమర్థతను గుర్తించి రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి నిరంతరం పాటు పడతానని తెలిపారు. మరోసారి నా సేవలను గుర్తించి పదవి అందించిన ఆర్ కృష్ణయ్య, నోకాలమ్మ, ఇతర పెద్దలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలనుఈ గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# కీర్తిశేషులు రాజన్న విగ్రహా ఆవిష్కరణ



**సి కె న్యూస్ ప్రతినిధి,బయ్యారం: 20 జూన్:** సింగారం గ్రామంలో, బయ్యారం మండలం లో %్రూా +ఖ% పేట పాఠశాలలో పనిచేస్తూ ఆరోగ్యం క్షీణించి గత సంవత్సరం అసువులు బాసిన కీర్తిశేషులు గంగావత్ రాజన్న (ప్రభుత్వ ఉపాధ్యాయులు) విగ్రహాన్ని ఎంతో వ్యయ ప్రయాసలతో చేకూర్చి, వారి జ్ఞాపకంగా వారి భార్య గంగావత్ పద్మ ,ఇద్దరు కూతుళ్లు సోనాలిబిందు రుస్మిత చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో %ఋుఖీ% రాష్ట్ర అధ్యక్షులు వీరు నాయక్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శివ నాయక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి భద్రు నాయక్ భాస్కర్ నాయక్

మండల అధ్యక్షా, ప్రధాన కార్యదర్శి భావు సింగ్ , మూడ్ బాలాజీ .

నాయకులు బిచ్చ నాయక్, రాంబాబు ,రవీందర్ నాయక్, బిక్షపతి, రాము, బిచ్చ, రాంజీ

గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

# ట్రయల్ రన్ కోసమేనా?

వైసీపీ అధినేత జగన్ మరొకసారి పాదయాత్ర చేయడానికి సిద్ధమయ్యారు. అందుకోసమే ట్రయల్ గా ఇప్పుడు జిల్లాలను పర్యటిస్తున్నారట. ప్రజల్లో తనకు ఉన్న ఇమేజ్ తగ్గిందా? లేదా? అన్న అంచనాలను వేసుకోవడానికే జగన్ ఈ రకమైన పర్యటనలు చేపట్టినట్లు పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తుంది. అన్ని ప్రాంతాల్లో తాను పర్యటించిన తర్వాత పాదయాత్రకు శ్రీకారం చుట్టాలని జగన్ భావిస్తున్నారని తెలిసింది. 2019 ఎన్నికలకు ముందు చేపట్టిన యాత్ర సక్సెస్ అయి అధికారం దక్కడంతో ఈసారి కూడా అదే ఫార్ములాతో వెళ్లాలన్నది జగన్ అభిప్రాయంగా ఉంది. అయితే ఏ సమయంలో పాదయత్ర నిర్వహిచాలన్నది ఇంకా నిర్ణయించకపోయినా 2027 లో యాత్రకు శ్రీకారం చుట్టే అవకాశముందని సీనియర్ నేతలు ఒకరు తెలిపారు.

**మరోసారి కాళ్లకు పనిచెప్పి...**

వైఎస్ జగన్ మళ్లీ పాదయాత్రతో జనంలోకి వెళ్లడానికే నిర్ణయించుకున్నారు. రాయలసీమలో తన గ్రాఫ్ పెరిగిందని జగన్ భావిస్తున్నారు. రాప్తాడు నియోజకవర్గం రామగిరికి వెళ్లినప్పుడు చివరకు తాను ప్రయాణించే హెలికాప్టర్ కూడా ధ్వంసమయింది. అలాగే తిరుపతిలో తొక్కిసలాట జరిగి మరణించినప్పుడు పార్టీ కార్యకర్తలు విపరీతంగా వచ్చారు. ఇక కడప తన సొంత జిల్లా కావడంతో ఈసారి తనకు ప్రజలు అండగా నిలబడతారని భావిస్తున్నారు. కర్నూలు జిల్లాకు వెళ్లినప్పుడు నంద్యాల ప్రాంతంలో కూడా జనం పోటెత్తారు. దీంతో రాయలసీమలో ఇక తనకు ఇబ్బంది లేదని, తిరిగి తన ఇమేజ్ బిల్డప్ అయిందని జగన్ పూర్తిగా విశ్వసిస్తున్నారు. తన పాలనకు, ప్రస్తుతకూటమి పాలనకు బేరీజు వేసుకున్న ప్రజలు క్రమంగా తనవైపునకు సీమలో తిరుగుతున్నారని భావిస్తున్నారు.

**పొదిలి, పల్నాడు పర్యటనలు సక్సెస్ కావడంతో**

ఇక ప్రకాశం జిల్లా పొదిలి పర్యటనలో అనూహ్య స్పందన లభించింది. చివరకు పోలీసులకు, వైసీపీ కార్యకర్తలకు మధ్య ఘర్షణ కూడా జరిగింది. జనం హెలికాప్టర్ ల్యాండ్ అయిన దగ్గరనుంచితిరిగి టేకాఫ్ అయ్యేంత వరకూ తన వెంటే ఉండటంతో ఆ జిల్లాపై కూడా భరోసా వచ్చింది. తెనాలి పర్యటనకు వెళ్లినప్పుడు కూడా నం పోటెత్తారు. తాజాగా పల్నాడు జిల్లాలో పర్యటన కూడా ఫుల్లు సక్సెస్ అయిందని వైసీపీ వర్గాలే కాదు అందరూ ఒప్పుకుంటున్నారు. రెంటపాళ్ల గ్రామానికి చేరుకోవాలంటే ఆరు గంటల సమయం పట్టిందంటే అడుగడుగునా జగన్ ను కార్యకర్తలు ఎలా కాళ్లకు అడ్డంపడ్డారన్నది అర్థం అవుతుంది. రాజధాని అమరావతి పక్కన ఉన్న గుంటూరు జిల్లాలో తన పర్యటన గ్రాండ్ సక్సెస్ కావడంతో ఇక జగన్ ఉత్తరాంధ్రతో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లో పర్యటించాల్సి ఉంది.

**బలహీనంగా ఉన్న...**

శ్రీకాకుళం, విశాఖపట్నంలో పార్టీ బలహీనంగా ఉందని జగన్ వివిధ నివేదికల ద్వారా తెప్పించుకుని దానిని సెట్ రైట్ చేసి అక్కడ బలమైన నాయకత్వాన్ని ఏర్పాటుచేసిన తర్వాత ఆ జిల్లాలకు వెళ్లాలన్న యోచనలో ఉన్నారని తెలిసింది. ఇక గెలుపునకు ఖచ్చితంగా అత్యధిక స్థానాలు సాధించాల్సిన తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లాల్లో కూడా జగన్ వివిధ దశల్లో పర్యటించిన తర్వాత పాదయాత్ర మొదలు పెట్టాలన్న యోచనలో ఉన్నారు. పాదయాత్ర ద్వారా అయితేనే తాను ప్రజల్లోకి సులువుగా వెళ్లగలనని, వారిని కలుసుకోవడంతో పాటు నేరుగా కనెక్ట్ అయి వారితో ఇంటరాక్ట్ అయితే వచ్చే ఫలితం అనుకూలంగా వస్తుందని జగన్ అంచనా వేస్తున్నారు.

**ఎక్కడెక్కడ లోపాలున్నదీ...**

దీంతో పాటు పార్టీలో ఎక్కడెక్కడ ఏ రకమైన లోపాలున్నాయన్నది కూడా గుర్తించేందుకు పాదయాత్ర ఉపయోగపడుతుందని జగన్ భావిస్తున్నారు. అయితే ప్రభుత్వంపై ఇంకా బాగా వ్యతిరేకత పెరిగిన తర్వాత మాత్రమే పాదయాత్ర చేపడితే మంచి ఊపు లభిస్తుందని ఆయన భావిస్తున్నారు. అందుకోసమే ముందుగా అన్ని జిల్లాల్లో పర్యటనలు చేసిన తర్వాత మంచి ముహూర్తం చూసుకుని 2027లో పాదయాత్ర మొదలుపెట్టి ఎన్నికల నాటికి పూర్తి చేయాలన్న ఆలోచనలో ఉన్నారని తెలిసింది. ఈసారి కూడా గతంలో మాదిరిగా తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న తర్వాతనే పాదయాత్ర ప్రారంభించాలని ఆయన భావిస్తున్నారు. పాదయాత్ర రోడ్ మ్యాప్ ఇంకా ఖరారు కాలేదు కానీ బహుశ ఈసారి ఇచ్ఛాపురం నుంచి ఇడుపులపాయ వరకూ జగన్ పాదయాత్ర చేస్తారన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. మరి పాదయాత్ర మరోసారి అధికారాన్ని తెచ్చిపెడుతుందా? లేదా? అన్నది మాత్రంచూడాల్సి ఉంది.

# ఈ కాలుష్యం చాలా డేంజర్.. సంతాన లోపం, కిడ్నీ సమస్యలు.. ప్రమాదాలెన్నో





కాలుష్యం.. ప్రపంచమంతటినీ వణికిస్తున్న భూతమిది. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ కాలుష్యం పెరిగిపోతూనే ఉంది. మానవ మనుగడపై ప్రభావం చూపుతూనే ఉంది. గుండె సంబంధిత జబ్బులతో సంభవిస్తున్న మరణాల్లో 75 శాతం, ఊపిరితిత్తుల వ్యాధులతో జరుగుతున్న మరణాల్లో 25 శాతం కేవలం గాలి కాలుష్యం కారణంగానేనని ఇప్పటికే పరిశోధకులు నిర్ధారించారు. ముఖ్యంగా భారత్, చైనా దేశాలతో కూడిన ఆసియా ఖండం ప్రాంతంలో కాలుష్యం కారణంగా మరణాలు మరింత ఎక్కువని గుర్తించారు. అంతేకాదు కాలుష్యం కారణంగా వంధ్యత్వం, ఎముకలు గుల్లబారిపోవడం వంటి శారీరక సమస్యలతోపాటు మానసిక సమస్యలూ తలెత్తుతాయని తాజాగా పలు పరిశోధనల్లో తేల్చారు. మరి ఈ ప్రమాదాలు, వాటిని నివారించే మార్గాలు తెలుసుకుందాం..

**వంటగది నుంచి వాహనాల పొగ దాకా..**

వాయు కాలుష్యం నేడు ప్రపంచాన్ని వణికిస్తున్న అతి పెద్ద సమస్య. మనకుకనిపించే కాలుష్యం పొగ గొట్టాల నుంచి, శిలాజ ఇంధనాల దహనం నుంచి, వాహనాలు తదితర వాటి నుంచి ఎక్కువగా వెలువడుతోంది. వీటి వల్ల అతి ప్రమాదకరమైన గోధుమ రంగు పొగ మంచు (బ్రౌన్ హెజ్) వాతావరణంలో ఏర్పడుతోంది. ఇది మనిషిఆరోగ్యానికి చాలా ప్రమాదకరమైనదని అమెరికన్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

శిలాజ ఇంధనాలు అంటే పెట్రోల్, డీజిల్, కిరోసిన్ వంటి వాటిని మండించినప్పుడు అతి సూక్ష్మమైన కణాలు (అల్ట్రా ఫైన్ పార్టికల్స్) వెలువడుతాయి.

వీటి నుంచే కాకుండా గ్యాస్ ఆధారిత వాహనాల నుంచి వచ్చే పొగ, గడ్డిని కోసే యంత్రాలు (లాన్ మూవర్స్), కట్టెలను కాల్చడం, ఎండిపోయిన ఆకులను కాల్చలడం, స్మోకింగ్ ద్వారా కూడా అల్ట్రాఫైన్ పార్టికల్స్ గాలిలో కలుస్తున్నాయి.

ఇవి ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమైనవి.

అంతేకాకుండా వంట గదిలో చికెన్, మటన్ వంటకాలు చేసేటప్పుడు కూడా ఈ కణాలు వెలువడుతున్నాయని శాస్త్రవేత్తలు నిర్ధారించారు.

ఇవి వేగంగా గాలిలో కలిసిపోతాయని, తర్వాత ఒకదానికొకటి కలసి పెద్ద కణాలుగా మార్పు చెందుతాయని గుర్తించారు. ఈ అల్ట్రాఫైన్ పార్టికల్స్ రహదారుల పక్కన ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు.



**సంతాన సామర్థ్యం తగ్గిపోవడం**

గాలిలో అత్యధిక కాలుష్యం కారణంగా పురుషుల్లో వంధ్యత్య సమస్య తలెత్తుతోందని తైవాన్ కు చెందిన పరిశోధకులు తేల్చారు. కాలుష్యం వల్ల పురుషుల్లో వీర్య కణాల నాణ్యత తగ్గిపోతోందని గుర్తించారు. 15 నుంచి 49 ఏళ్ల మధ్య వయసున్న దాదాపు 6,500 మంది పురుషుల్లో వీర్య కణాల ఉత్పత్తి, వాటి పరిస్థితి, క్రియాశీలత తదితర అంశాలపై మూడు నెలల పాటు అధ్యయనం చేశారు. ఈ ఫలితాలను రెండేళ్ల సమయానికి అన్వయించి.. అంచనాలను రూపొందించారు.

గాలిలో చేరే పర్టిక్యులేట్ మేటర్ (%ాపీ%) అత్యధిక స్థాయిల్లో పీల్చడం వల్ల వీర్య కణాల ఆకారం, పరిమాణం అసాధారణంగా మారిపోయినట్లు పరిశోధకులు గుర్తించారు. (పర్టిక్యులేట్ మేటర్ అంటే గాలిలో చేరే అతి సూక్ష్మ రసాయన కణాలు, దుమ్ము, ధూళి కణాలు).

అయితే వారిలో వీర్య కణాల సంఖ్య మాత్రం తగిన సంఖ్యలోనే ఉన్నట్లు నిర్ధారించారు. కానీ వాటి సామర్థ్యం లోపించడం కారణంగా.. ఈ వీర్య కణాలు గర్భధారణ కోసం పనికిరానివిగా మారిపోతున్నాయని తేల్చారు.

**ఎముకలు గుల్లబారి విరిగిపోవడం**

ఆస్టియో పోరోసిస్.. అంటే ఎముకల కణాల్లో సాంద్రత తగ్గి గుల్లబారిపోయే సమస్య. దీనివల్ల ఎముకల్లో పటుత్వం తగ్గిపోయి చిన్న దెబ్బ తగిలినా విరుగుతాయి. సాధారణంగా వయసు మీద పడిన కొద్దీ ఎముకల్లో పటుత్వం తగ్గుతూ ఆస్టియో పోరోసిస్ సమస్య తలెత్తుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఏటా ఆస్టియో పోరోసిస్ కారణంగా సుమారు 89 లక్షల మంది ఎముకలు విరిగే సమస్య (కాళ్లు, చేతులు, ఇతర భాగాల్లో ఎముకలు విరగడం) బారిన పడుతున్నట్లు ప్రపంచ ఆస్టియోపోరోసిస్ ఫౌండేషన్ లెక్కతేల్చింది. అయితే గాలి కాలుష్యం ఈ ఆస్టియోపోరోసిస్ సమస్య మరింతగా పెరగడానికి కారణమవుతోందని అమెరికన్ శాస్త్రవేత్తలు నిర్ధారించారు. గాలి కాలుష్యానికి గురైనప్పుడు శరీరంలో పారా థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తి తగ్గుతోందని, ఇది ఆస్టియో పోరోసిస్ కు దారి తీస్తోందని గుర్తించారు. ది లాన్సెట్: ప్లానెటరీ హెల్త్ జర్నల్ లో వారి అధ్యయన నివేదిక ప్రచురితమైంది.

**అమెరికన్ శాస్త్రవేత్తలు రెండు దశల్లో ఈ అధ్యయనం చేశారు.**

తొలి దశలో కాలుష్యం ఎక్కువగా ఉండే ఒక ప్రాంతాన్ని, కాలుష్యం అతి తక్కువగా ఉండే మరో ప్రాంతాన్ని ఎంచుకున్నారు. ఈ ప్రాంతాల్లో 65 ఏళ్లు పైబడిన 92 లక్షల మందికి సంబంధించిన వైద్య రికార్డులను పరిశీలించారు. 2003 నుంచి 2010 వరకు ఏడేళ్లకు సంబంధించిన డేటాను సేకరించి విశ్లేషించారు. ఏయే ప్రాంతంలో ఏ సమయంలో ఎంత మంది ఎముకలు విరిగిన సమస్యతో బాధపడింది లెక్కించారు. ఆయా సమయాల్లో ఏ ప్రాంతంలో ఎంత గాలి కాలుష్యం నమోదైంది పోల్చి చూశారు. మొత్తంగా కాలుష్యం స్థాయి అధికంగా నమోదైన ప్రాంతాలకు చెందినవారిలో ఆస్టియోపోరోసిస్ సమస్య ఎక్కువగా ఉందని, ఎముకలు విరిగే సమస్య కూడా ఎక్కువగా ఉందని గుర్తించారు.

ఇక శాస్త్రవేత్తలు రెండో దశలో వాహనాల కాలుష్యం అత్యధికంగా ఉండే ఓ పట్టణ ప్రాంతాన్ని ఎంచుకుని పరిశోధన చేశారు. 35 ఏళ్ల నుంచి 55 ఏళ్ల మధ్య వయసున్న 692 మంది పురుషులకు సంబంధించి.. కొన్నేళ్ల వైద్య రికార్డులను పరిశీలించారు. కాలుష్యం తక్కువగా ఉండే ప్రాంతాల వారితో పోల్చితే.. కాలుష్యం అధికంగా ఉన్న ఈ పట్టణ ప్రాంతాల వారిలో పారా థైరాయిడ్ హార్మోన్ స్థాయి తక్కువగా ఉందని, ఆస్టియో పోరోసిస్ సమస్య అధికంగా ఉందని గుర్తించారు. శరీరంలో ఎముకల నిర్మాణం, ఎముకలు పటిష్టంగా ఉండడం కోసం పారాథైరాయిడ్ హార్మోన్ కీలకంగా పనిచేస్తుంది. ఇది తక్కువగా ఉండడం కారణంగా ఎముకలు గుల్లబారుతాయి.

**పక్షవాతం ముప్పు కూడా..**

గాలి కాలుష్యం కారణంగా పక్షవాతం వచ్చే ముప్పు కూడా పెరుగుతోందని అమెరికన్ శాస్త్రవేత్తలు ఇటీవలి ఓ అధ్యయనంలో తేల్చారు. పక్షవాతం, దాని సంబంధిత సమస్యల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 50 లక్షల మంది మరణిస్తున్నట్లు అంచనా. దీని బారినపడి ఎంతో మంది శారీరక వైకల్యం పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు పక్షవాతానికి, కాలుష్యానికి మధ్య సంబంధంపై పరిశోధన చేశారు. ప్రపంచవ్యాప్తంగా 28 దేశాలకు చెందిన 62 లక్షల మంది పక్షవాతం బాధితులపై జరిగిన 94 అధ్యయనాలను ఒక చోట క్రోడీకరించి పరిశీలించారు. 1948 నుంచి 2014 మధ్య సుదీర్ఘంగా జరిగిన ఆ అధ్యయనాల ఆధారంగా.. పక్షవాతం సమస్యలకు, గాలిలో హానికర రసాయనాలు, పర్టిక్యులేట్ మేటర్ స్థాయిలకు మధ్య సంబంధమున్నట్లు గుర్తించారు.

విపరీతంగా గాలి కాలుష్యం ఉన్న ప్రాంతాల్లో చిన్న వయసులోనే పక్షవాతం బారిన పడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనంలో నిర్ధారించారు.

ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని.. ఇతర సమస్యలతో పాటు గాలి కాలుష్యం కూడా తోడై బ్రెయిన్ స్ట్రోక్ వంటివాటికి కారణమవుతోందని వారు చెబుతున్నారు.

**కిడ్నీల పనితీరుకు దెబ్బ**

విపరీతంగా గాలి కాలుష్యానికి లోనవుతున్న వారిలో మూత్రపిండ (కిడ్నీ) సంబంధిత సమస్యలు ఎక్కువగా వస్తున్నట్లు అమెరికన్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ శాస్త్రవేత్తలు గుర్తించారు. గాలిలోని కలుషితాలు ఊపిరితిత్తుల ద్వారా రక్తంలోకి చేరుతున్నాయని, ఆ కలుషితాలను తొలగించే క్రమంలో కిడ్నీలు దెబ్బతింటున్నాయని తేల్చారు. వారు ఈ అంశంపై చాలా పెద్ద పరిశోధనే చేశారు. అమెరికా అంతరిక్ష సంస్థ నాసాకు చెందిన శాటిలైట్ల ద్వారా పలు ప్రాంతాల్లో గాలి కాలుష్యం స్థాయిలను లెక్కించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో నివసించే సుమారు 20 లక్షల మందికి సంబంధించిన వైద్య రికార్డులను విశ్లేషించారు.

గాలి కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కిడ్నీ సంబంధిత సమస్యలు ఏటేటా బాగా పెరిగిపోతున్నట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు.

అత్యధిక కాలుష్యం స్థాయిలే కాదు.. కొంచెం కాలుష్యంతోనూ కిడ్నీల పనితీరుపై ప్రభావం పడుతుందని.. కాలుష్యం స్థాయిని బట్టి సమస్యల తీవ్రత ఉంటుందని అమెరికాకు చెందిన సెయింట్ లూయిస్ హెల్త్ కేర్ సిస్టమ్ డైరెక్టర్ జియాద్ అల్లీ పేర్కొన్నారు.

**కాలుష్యంతో అధిక రక్తపోటు ముప్పు...**

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కమ్ముకుంటున్న సమస్యల్లో అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) ఒకటి. కాలుష్యం కారణంగా కూడా ఈ సమస్య మరింతగా ఉధృతమవుతున్నట్లు యురోపియన్ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇందుకోసం స్పెయిన్, జర్మనీ, డెన్మార్క్, స్వీడన్, నార్వే తదితర దేశాలకు చెందిన 41 వేల మందిపై 2008 నుంచి 2015 వరకు పరిశోధన చేశారు. సర్వే కోసం ఎంచుకున్న సమయంలో వారెవరికీ కూడా అధిక రక్తపోటు సమస్య లేదు. అనంతరకాలంలో 15 శాతం మందికి ఈ సమస్య తలెత్తింది. అధ్యయనం చేసిన వారిలో అధిక రక్తపోటు సమస్య తలెత్తిన వారి వివరాలను పరిశీలించగా.. వారంతా గాలి కాలుష్యం అధికంగా ఉండే ప్రాంతాల్లోనే నివసిస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

గాలిలో రసాయన కలుషితాలు, పర్టిక్యులేట్ మేటర్ ఊపిరితిత్తుల ద్వారా శరీరంలో చేరి ఆరోగ్య సమస్యలను తలెత్తుతున్నాయని, అధిక రక్తపోటు సమస్యకు దారి తీస్తోందని పరిశోధనకు నేతృత్వం వహించిన జర్మనీ హెన్రిచ్ హేయిన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బార్బరా హోఫ్ మన్ వెల్లడించారు.

**గర్భస్త శిశువుల ఎదుగుదలపై ప్రభావం**

గాలిలో ఉండే హానికరమైన, విషపూరిత రసాయనాలు గర్భస్థ శిశువుల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతాయని అమెరికన్ పరిశోధకులు చెబుతున్నారు. ముఖ్యంగా గర్భం తొలి దశలో అంటే ఒకటో నెల నుంచి మూడో నెల వరకు ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. న్యూయార్క్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ప్రొఫెసర్ జేసన్ బ్లమ్ నేతృత్వంలోని బృందం దీనిపై పరిశోధన చేసింది. అమెరికాలోని పలు ప్రాంతాల్లో చిన్నారులకు జన్మనిచ్చిన మహిళల వైద్య రికార్డులను, ఆయా ప్రాంతాల్లో కాలుష్యం స్థాయిలను వారు విశ్లేషించారు. దీంతోపాటు ప్రయోగశాలలోనూ గర్భస్థ ఎలుకలపై పరిశోధన చేశారు.

కాలుష్యం కారణంగా గర్భంలో పిండం ఎదుగుదల దెబ్బతింటుందని, నెలలు నిండకముందే కాన్పు జరుగుతుందని పరిశోధనలో తేలినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ముఖ్యంగా గర్భం తొలిదశలో అంటే తొలి మూడు నాలుగు నెలల పాటు తీవ్ర స్థాయిలో కాలుష్యానికి గురైతే.. బిడ్డ చాలా తక్కువ బరువుతో జన్మిస్తున్నట్లుగా వెల్లడైంది.

**కలుషితాలతో మానసిక సమస్యలు**

కలుషితమైన గాలి కారణంగా శారీరక సమస్యలే కాదు.. మానసిక సమస్యలూ తలెత్తుతున్నట్లు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ పరిశోధకులు తేల్చారు. దీనిపై అమెరికాలోని పలు ప్రాంతాల్లో గాలి కాలుష్యం డేటాను సేకరించి, ఆయా ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్యం రికార్డులతో సరిపోల్చి విశ్లేషించారు. కాలుష్యం తక్కువగా ఉన్న ప్రాంతాలతో పోలిస్తే.. ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని వారు 17 శాతం ఎక్కువగా మానసిక సమస్యలు, ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు.

ఇక పురుషులతో పోలిస్తే.. మహిళలపై గాలి కాలుష్యం ఎక్కువ ప్రభావం చూపుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. వీరు ఏకంగా 39 శాతం మంది మానసిక ఒత్తిళ్లతో బాధపడుతున్నట్లు తేల్చారు.

గాలిలోని కలుషితాలు.. మనలో ఒత్తిడిని పెంచే హార్మోన్లు ఎక్కువగా విడుదలవడానికి కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనికితోడు కలుషితమైన గాలి కారణంగా వచ్చే శ్వాస సమస్యలు, చర్మ సమస్యలు వంటివి కూడా ఒత్తిడిని పెంచుతున్నాయని పేర్కొంటున్నారు.


**అన్నీ కలసి గుండె జబ్బులు**

గాలిలో కలుస్తున్న వాహనాల పొగ, ఫాక్టరీలు, ఇతర కలుషితాల కారణంగా గుండె పోటు, కవాటాలు, రక్తనాళాలు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నట్లు అమెరికన్ హార్ట్ అసోసియేషన్ హెచ్చరిస్తోంది. ఆల్కాహాల్, కాఫీ వంటి వాటి అతి వినియోగం కారణంగా గుండె పోటు వచ్చే ప్రమాదం ఎంతగా ఉందో.. గాలి కాలుష్యం కారణంగా అంతే ప్రమాదం ఉందని స్పష్టం చేస్తోంది. ఇందుకోసం అమెరికన్ హార్ట్ అసోసియేషన్ శాస్త్రవేత్తలు 1960 నుంచి 2010 మధ్య జరిగిన 36 అధ్యయనాల ఫలితాలను క్రోడీకరించి పరిశీలించారు.

మొత్తంగా సంభవిస్తున్న గుండెపోటు ఘటనల్లో 5 నుంచి 7 శాతం వరకు గాలి కాలుష్యమే కారణమని వెల్లడైందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ముఖ్యంగా ఇతర జబ్బులతో బాధపడుతున్నవారు గాలి కాలుష్యానికి లోనైతే గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

# ఆ రెండిటితో ఫాంలోకి వస్తుందా..?



ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ ఇస్మార్ట్ శంకర్ తో హిట్ అందుకుని క్రేజ్ తెచ్చుకోగా ఆ తర్వాత తెలుగులో వరుస సినిమాలు చేస్తుందని ఊహించగా సడెన్ గా కోలీవుడ్ షిఫ్ట్ అయ్యి షాక్ ఇచ్చింది. గల్లా అశోక్ తో హీరో సినిమా చేసిన నిధి అగర్వల్ ఆ తర్వాత తెలుగులో సినిమాలు చేయలేదు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో హరి హర వీరమల్లు సినిమా చేసిన ఈ అమ్మడు ఆ సినిమా త్వరలో రిలీజ్ కాబోతుంది. అదే కాదు ప్రభాస్ తో రాజా సాబ్ సినిమాలో కూడా నిధి నటిస్తుంది.తెలుగులో దాదాపు కెరీర్ అయిపోయింది అనుకుంటున్న టైం లో ఒకేసారి రెండు భారీ సినిమాలతో రాబోతుంది నిధి అగర్వాల్. వీరమల్లు సినిమా జూన్ 12న రిలీజ్ అనుకున్నారు కానీ మళ్లీ వాయిదా వేశారు. సినిమా ఐతే మరో నెల రోజుల్లో రిలీజ్ అయ్యే ఛాన్స్ ఉంది. ఇక ప్రభాస్ రాజా సాబ్ సినిమాను డిసెంబర్ లో రిలీజ్ ఫిక్స్ చేశారు. మారుతి డైరెక్షన్ లో తెరకెక్కుతున్న రాజా సాబ్ సినిమా థ్రిల్లర్ జోనర్ లో సంథింగ్ స్పెషల్ గా రాబోతుంది.ఈ రెండు సినిమాలు ఒకేసారి రిలీజ్ అవ్వడంతో నిధి అగర్వాల్ మళ్లీ టాలీవుడ్ లో ట్రెండింగ్ టాపిక్ గా మారింది. వీరమల్లు, రాజా సాబ్ రెండు సినిమాలు కూడా వేరు వేరు కథలతో వస్తున్నాయి. వీరమల్లు సినిమా పీరియాడికల్ కథతో ఒక బందిపోటు దొంగ కథతో వస్తుంటే రాజా సాబ్ మాత్రం థ్రిల్లర్ కథతో వస్తుంది. ఈ రెండు సినిమాలు కూడా హిట్టు పడితే మాత్రం నిధి తిరిగి ఫాం లోకి వస్తుందని చెప్పొచ్చు.నిధి లాంటి అందాల భామకు తెలుగులో అవకాశాలు వస్తున్నా కూడా ఆమె కావాలని కాదంటుందని అంటున్నారు. మొన్నటిదాకా తమిళ్ లో బిజీగా ఉంది కాబట్టి తెలుగు సినిమాలు చేయలేదు కానీ ఇప్పుడు అక్కడ కూడా పెద్దగా ఆఫర్లు లేవు కాబట్టి తెలుగులో నిధి అగర్వాల్ బిజీ అయ్యే ఛాన్స్ ఉంటుంది. నిధి తెలుగులో బిజీ అయితే మాత్రం ఆమె ఫ్యాన్స్ కి పండగ అన్నట్టే అని చెప్పొచ్చు. పవన్, ప్రభాస్ లాంటి స్టార్ హీరోల సినిమాల్లో ఒకేసారి ఛాన్స్ అందుకున్న నిధి ఆ సినిమాలు 3, 4 నెలల గ్యాప్ లో రిలీజ్ అవ్వడంతో అమ్మడికి కలిసి వచ్చేలా ఉంది.



**చీరలో దేవియాని శర్మ: సంప్రదాయం & ధోరణి యొక్క పర్ఫెక్ట్ సమ్మేళనం**




**సాక్షి మాలిక్ తన నిజాయితీ యోగా జర్నీని పంచుకున్నారు**

# సోనాక్షి రేసులో ఇలా వెనుకబడితే ఎలా?

బాలీవుడ్ లెజెండరీ నటుడు శత్రుజ్ఞు సిన్హా వారసురాలిగా సోనాక్షి సిన్హా తెరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. %-%దబాంగ్%-% చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన అమ్మడు హీరోయిన్గా చాలా సినిమాలు చేసింది. స్పెషల్ అప్పిరియన్స్ లతోనూ అలరించింది. సోనాక్షి ఇప్పటికే 15 ఏళ్ల కెరీర్ ను పూర్తి చేసుకుంది. మరి బాలీవుడ్ హీరోయిన్లలో సోనాక్షి స్థానం ఎన్నవది? అంటే చెప్పడం కష్టం. అమ్మడు మంచి పెర్ఫార్మర్.

కొన్ని యూనిక్ క్వాలిటీస్ ఉన్నాయి. కానీ స్టార్ హీరోయిన్ గా మాత్రం ఫేమస్ కాలేకపోయింది. దీపికా పదు కొణే, కరీనా కపూర్ , అలియాభట్ లా ఇండస్ట్రీలో రాణించలేకపోతుంది? అన్నది వాస్తవం. 15 ఏళ్ల కెరీర్ అంటే సోనాక్షి ఇప్పటికే స్టార్ లీగ్ లో చేరిపోయావాలి. హీరోయిన్ గా ఓ బ్రాండ్ లా వెలిగిపోవాలి. భారీగా పారితోషిక అందుకోవాలి. బ్రాండ్ అంబాసిడర్ గా ఫుల్ బిజీగా ఉండాలి.

ఇండస్ట్రీలో తనకంటూ ఓ



సామ్రాజ్యాన్ని సృష్టించుకోవాలి. కానీ సోనాక్షి వీటిన్నింటికి దూరంగానే ఉంది. వచ్చిన అవకాశాలు చేసుకుంటూ వెళ్లడం తప్ప! తన బ్రాండ్ మాత్రం వేయలేకపోయింది. తండ్రికి తగ్గ తనయగా బాలీవుడ్ లో ఎదగలేకపోయింది. స్టార్ హీరోలతో పనిచేసింది కూడా చాలా తక్కువ సినిమాల్లోనే. ఈ మధ్యనే ఓ తెలుగు సినిమాలో కూడా నటిస్తోంది. సోనాక్షి రేంజ్ మూవీ కాదది. కానీ వచ్చిన అవకాశాన్ని కాదనకుండా సద్వినియోగం చేసుకుంటుంది.ఈ విషయంలో సోనాక్షిని మెచ్చుకోవాలి. అమ్మడు ఎంతో డౌన్ టౌ ఎర్త్. తండ్రి పెద్ద స్టార్ అయినా? తాను మాత్రం ఎంతో సింపుల్ లైఫ్ ని లీడ్ చేస్తుంది. సోనాక్షి పెళ్లి చేసుకుంది కూడా ఓ సినిమా రైటర్ ని. అయితే కెరీర్ పరంగా మాత్రం సోనాక్షి చేరాల్సిన గమ్యం ఇంకా చేరలేదు. మరి నవ నాయి కల మధ్య పోటీని తట్టుకుని ఆ రేంజ్ కు చేరుతుందా? లేదా? అన్నది చూడాలి.